STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 351 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 21 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

రేఖానాయక్ నివాసాలపై ఈడీ, విజిలెన్స్ సోదాలు

- రూ.40.96 కోట్ల సీఎంఆర్ ధాన్యం గోల్‌మాల్
- 9,639 మెట్రిక్ టన్నుల బియ్యం కొరత
- రెండు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- ఖానాపూర్‌లో పోలీసుల భారీ బందోబస్తు

వివరాలు 2లో..

ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు రేఖానాయక్ సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) వ్యవహారంలో దర్యాప్తు సంస్థల నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. సుమారు రూ.40.96 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం గోల్‌మాల్ వ్యవహారంపై ఈడీ, విజిలెన్స్ అధికారులు శుక్రవారం సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు.



4

వాహనాలపై కులం పేరు కనిపిస్తే చర్యలే!

కుల గుర్తులు, పేర్లు, చిహ్నాల ప్రదర్శనపై గుజరాత్ ప్రభుత్వం నిషేధం

సంస్కృతుల కలయికే.. ప్రపంచ శాంతికి రక్ష

- దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడులతో సంబంధాలు బలోపేతం
- షాంఘై సహకార సంస్థ నాగరికతల సంభాషణ వేదికలో ప్రధాని మోదీ
- ప్రాచీన గ్రంథాలు, చారిత్రక పత్రాలను అంకెల రూపంలో భద్రపరచాలని సూచన
- బౌద్ధ క్షేత్రాలు, ప్రాచీన వాణిజ్య మార్గాలతో పర్యాటకాభివృద్ధికి పిలుపు



4

అందుబాటులోకి స్వదేశీ బర్డ్ ఫ్లూ వ్యాక్సిన్

భోపాల్‌లో ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్!



4



దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యం

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల తెలంగాణ!
- మూడు జోన్లుగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమానికి పెద్దపీట
- ప్రజాస్వామ్య పరిరక్షణకు రాహుల్ నాయకత్వం అవసరం
- 'సదరన్ రైజింగ్ సమ్మిట్'లో సీఎం రేవంత్ రెడ్డి

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన 'సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026'లో పాల్గొన్న ఆయన, రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన 'సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026'లో పాల్గొన్న ఆయన రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలు, దేశ రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. 2047 నాటికి భారత్‌ను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యంలో తెలంగాణ గణనీయమైన పాత్ర పోషించాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో 'తెలంగాణ రైజింగ్' పేరుతో ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు (లక్ష కోట్ల డాలర్లు), 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.5 శాతం కాగా, జీడీపీలో రాష్ట్రం ప్రస్తుతం 5 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని, భవిష్యత్తులో ఈ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమని చెప్పారు. దేశ పురోగతిలో దక్షిణాది రాష్ట్రాల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు.

మిగతా 2 లో



పట్టణాల అభివృద్ధికి రూ. 20 వేల కోట్ల ప్రణాళిక!

- అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహకారంతో భారీ ప్రాజెక్టులకు ప్రతిపాదనలు
- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి
- సీఎం రేవంత్ రెడ్డి

2

సీఈసీ, ఈసీ నియామక చట్టంపై విస్తృత విచారణ

ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి బాధ్యత

లీకాల్ పిటిషన్‌పై విడిగా విచారణకు నిరాకరణ

జస్టిస్ శర్మ పదవీ విరమణపై సీజేఐ స్పష్టత



4



దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

ఎన్నిక చెల్లదంటూ విజయారెడ్డి పిటిషన్

తదుపరి విచారణ డిసెంబర్ 5న

.. వివరాలు 2లో



దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్న రాహుల్

భారత ప్రగతిపై తప్పుడు ప్రచారం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

.. వివరాలు 3లో

భూ లీసర్వేకు ఆరు దశల్లో మార్గదర్శకాలు

పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ సీసీఎల్ఏ ఉత్తర్వులు



.. వివరాలు 2లో



ఉత్తమ నటుడు రణ్‌వీర్.. 'ధురంధర్'కు అవార్డుల మోత

వివరాలు 8వ పేజీలో

- దాదాసాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ చలనచిత్రోత్సవ పురస్కారాల ప్రకటన
- ఉత్తమ చిత్రం, దర్శకుడు సహా పలు విభాగాల్లో 'ధురంధర్' హవా
- 'సయారా' చిత్రానికి ఉత్తమ నటిగా అనీత్ పడ్డా
- అంతర్జాతీయ కళాకారిణిగా టేలర్ స్విఫ్ట్‌కు గౌరవం
- కమల్‌హాసన్, ఇళయరాజాలకు విశిష్ట పురస్కారాలు





రేఖానాయక్ నివాసాలపై ఈడీ, విజిలెన్స్ సోదాలు

రూ.40.96 కోట్ల సీఎంఆర్ ధాన్యం గోల్‌మాల్

9,639 మెట్రిక్ టన్నుల బియ్యం కొరత

రెండు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు

ఖానాపూర్‌లో పోలీసుల భారీ బందోబస్తు

హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు రేఖానాయక్ సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) వ్యవహారంలో దర్యాప్తు సంస్థల నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. సుమారు రూ.40.96 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం గోల్‌మాల్ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), విజిలెన్స్ అధికారులు శుక్రవారం సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఆమె నివాసంతో పాటు మరో ప్రాంతంలోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహించి కీలక రికార్డులను పరిశీలించారు. సత్తెనపల్లిలో రేఖానాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు ప్రభుత్వం కేటాయించిన ధాన్యంలో 9,639.962 మెట్రిక్ టన్నుల మేర కొరత ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ తనిఖీల్లో గుర్తించింది. దీని విలువ రూ.40.96 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ ధాన్యాన్ని నిబంధనలకు విరుద్ధంగా పక్కదారి పట్టించారనే ఆరోపణలతో గత ఆగస్టులో ఆమెపై బీఎన్ఎస్ సెక్షన్లు 316(2), 316(5), 318(4), నిత్యావసర సరుకుల చట్టం కింద కేసు నమోదైంది. ఈ వ్యవహారంలో అక్రమంగా తరలించిన ధాన్యం ద్వారా వచ్చిన డబ్బు ఎక్కడికి చేరింది? ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరిగాయి? అనే అంశాలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు. ప్రభుత్వ ధాన్యం గోల్‌మాల్ వెనుక మనీలాండరింగ్ జరిగిందా అనే కోణంలో పత్రాలు, ఆర్థిక లావాదేవీల వివరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఖానాపూర్‌లో రేఖానాయక్ నివాసం వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించడంతో ఉద్రిక్తత నెలకొంది. సోదాల విషయం తెలుసుకున్న ఆమె అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అరెస్టు చేసే అవకాశం ఉందంటూ ప్రచారం జరగడంతో స్థానికంగా ఉత్కంఠ నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తును కట్టుదిట్టం చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

ఎన్నిక చెల్లదంటూ విజయారెడ్డి పిటిషన్

ఆస్తుల వివరాలు దాచారంటూ ఆరోపణలు

తదుపరి విచారణ డిసెంబర్ 5న

హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): ఖైరతాబాద్ అసెంబ్లీ ఎన్నికల వివాదంలో మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 2023 ఎన్నికల్లో ఆయన గెలుపును సవాల్ చేస్తూ దివంగత నేత పీజేఆర్ కుమార్తె, కాంగ్రెస్ నాయకురాలు పి. విజయారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం న్యాయస్థానం విచారణ చేపట్టింది. దానం నాగేందర్‌తో పాటు కేసులోని ఇతర ప్రతివాదులందరికీ నోటీసులు పంపించాలని ఆదేశించింది. ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌లో దానం నాగేందర్ తన ఆస్తులు, ఇతర కీలక వివరాలను ఉద్దేశపూర్వకంగా వెల్లడించలేదని విజయారెడ్డి ఆరోపించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అఫిడవిట్ సమర్పించినందున ఆయన ఎన్నికను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన తనను ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పిటిషన్‌తో పాటు అనుబంధ దరఖాస్తులపై విచారణ జరిపిన ధర్మాసనం.. విజయారెడ్డి తరపు న్యాయవాది వాదనలను ఆలకించింది. అనంతరం దానం నాగేందర్‌తో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులందరి వాదనలు విన్న తర్వాతే పిటిషన్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసిన హైకోర్టు, తదుపరి విచారణను డిసెంబర్ 5కు వాయిదా వేసింది.

భూ రీసర్వేను గడువులోగా పూర్తి చేయాలి: పొంగులేటి

రైతుల సమక్షంలోనే భూముల కొలతలు

హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): రాష్ట్రంలో దశాబ్దాలుగా పరిష్కారం కాని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన భూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు తన భూమిపై స్పష్టమైన, వివాదాలకు తావులేని హక్కులు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణం, క్షేత్రస్థాయి స్వాధీనం, రెవెన్యూ రికార్డుల్లోని వివరాల మధ్య ఉన్న వ్యత్యాసాలను శాస్త్రీయంగా, పారదర్శకంగా గుర్తించి పక్కా రికార్డులు రూపొందించాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో రైతులనే కేంద్రబిందువుగా తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. వారి సమక్షంలోనే భూములను కొలవడంతో పాటు, ప్రతి దశలో చేపడుతున్న పనులపై పూర్తి సమాచారాన్ని అందించాలని అధికారులకు సూచించారు. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. సాధారణ పరిపాలనా కార్యక్రమంగా కాకుండా ప్రత్యేక లక్ష్యంతో ఈ ప్రక్రియను చేపట్టి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. తెలంగాణ సర్వే మరియు సరిహద్దుల చట్టం–1923, తెలంగాణ భూ భారతి (భూమిలో హక్కుల రికార్డు) చట్టం–2025 నిబంధనలకు అనుగుణంగా రీసర్వే చేపట్టాలని తెలిపారు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పొంగులేటి ఆదేశించారు.

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల తెలంగాణ!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు కల్పించే ఉద్దేశంతో తెలంగాణను మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు వంటి కీలక ప్రాజెక్టులు పట్టణాలు, గ్రామాలు, పారిశ్రామిక ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అందరూ సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు ఇందిరమ్మ ఫ్యామిలీ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ఉస్మానియా ఆసుపత్రి, నిమ్స్, టిమ్స్ ద్వారా వైద్య రంగంలో వసతులను విస్తరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దేశంలో పెరుగుతున్న నిరంకుశ పోకడలను ఎదుర్కొనేందుకు, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడంతో పాటు సామాన్యుల సంక్షేమానికి కృషి చేయాలంటే దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎన్నో త్యాగాలు చేసిందని గుర్తుచేస్తూ, ప్రజలకు పాలకులుగా కాకుండా సేవకులుగా వ్యవహరించాలన్నదే తమ విధానమని చెప్పారు. మతం ఆధారంగా ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అసత్య ప్రచారానికి బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీని వేదికగా చేసుకుంటోందని విమర్శించారు. ప్రధాని మోదీ పట్ల ప్రజల్లో ఉన్న భయాన్ని యువతరం తొలగించిందని, ఆయన విదేశీ పర్యటనలపై ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ ప్రజల తరఫున పోరాడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తుందన్న ప్రశ్నకు స్పందిస్తూ, ఆ పార్టీకి భవిష్యత్తే లేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రేక్షక పాత్రకే పరిమితమైందని, ప్రధాన రాజకీయ పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యే కొనసాగుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



పట్టణాల అభివృద్ధికి రూ. 20 వేల కోట్ల ప్రణాళిక!

- అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహకారంతో భారీ ప్రాజెక్టులకు ప్రతిపాదనలు
- వరంగల్ నగరంలో భూగర్భ డ్రైనేజీ, వరదనీటి పారుదల వ్యవస్థల అభివృద్ధి
- శుద్ధి చేసిన మురుగునీటిని పరిశ్రమలకు వినియోగించేలా ప్రత్యేక విధానం
- వ్యర్థాల నుంచి 12 మెగావాట్ల వరకు విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక
- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): రాష్ట్రంలోని పట్టణాలను ఆధునిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు దాదాపు రూ.20 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వాతావరణ మార్పులను తట్టుకునేలా, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా పట్టణాల అభివృద్ధి జరగాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. పురపాలక శాఖ రూపొందించిన ప్రతిపాదనలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన సమీక్షించారు. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకు, జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకుతోపాటు దేశీయ ఆర్థిక సంస్థల సహకారంతో ఈ ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. వరంగల్ నగరంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, వర్షపు నీటి పారుదల వ్యవస్థల అభివృద్ధిపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. చారిత్రక వరంగల్ కోట చుట్టూ ఉన్న కందకాన్ని పునరుద్ధరించడం, హనుమకొండలో కేంద్ర వాణిజ్య ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం వంటి ప్రతిపాదనలను సీఎం పరిశీలించారు. పట్టణాల్లో వరద ముప్పును తగ్గించడంతోపాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు, ముఖ్యంగా వస్త్ర పరిశ్రమల పార్కులకు సరఫరా చేయడం ద్వారా మంచినీటి వనరులపై ఒత్తిడిని తగ్గించవచ్చని వివరించారు. పట్టణాల్లో తాగునీటి సరఫరా, శుద్ధి, పంపిణీ వ్యవస్థల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని సీఎం ఆదేశించారు. సాధ్యమైనంత వరకు పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకోవాలని సూచించారు. వరంగల్ మెగా సిటీ ఆర్థిక ప్రాంతం పరిధిలో వ్యర్థాల నుంచి 10 నుంచి 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను కూడా సీఎం సమీక్షించారు. జీవ ఇంధన వాయువు ఉత్పత్తి, ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగ కేంద్రాల ఏర్పాటుపైనా చర్చించారు. పట్టణాల్లో కర్బన ఉద్గారాలను తగ్గించడం, నీటి వనరులను సంరక్షించడం, వరదల నివారణతోపాటు పురపాలక సంస్థల నిర్వహణ వ్యయాన్ని తగ్గించడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యమని అధికారులు వివరించారు. అభివృద్ధితోపాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేలా ప్రణాళికలను రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

భూ రీసర్వేకు ఆరు దశల్లో మార్గదర్శకాలు

- పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ సీసీఎల్ఏ ఉత్తర్వులు
- సర్వేకు ముందు గ్రామసభలు, రైతులకు నోటీసులు
- కొలతల్లో తేడాలుంటే వెంటనే రైతులకు సమాచారం
- అభ్యంతరాల పరిష్కారానికి ప్రత్యేక శిబిరాలు



హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా నిర్వహించేందుకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) లోకేష్ కుమార్ సమగ్ర మార్గదర్శకాలు జారీ చేశారు. తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం–1923, తెలంగాణ భూ భారతి చట్టం–2025 నిబంధనలకు అనుగుణంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, సర్వే అధికారులు ఈ సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. గ్రామంలో రీసర్వే ప్రారంభమైనప్పటి నుంచి తుది గెజిట్ నోటిఫికేషన్ జారీ, భూ భారతి పోర్టల్‌లో రికార్డుల నవీకరణ వరకు మొత్తం ప్రక్రియను ఆరు దశలుగా విభజించారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టింది. ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ విస్తీర్ణానికి మధ్య వ్యత్యాసాలు ఉండటంతోపాటు, రికార్డుల్లోని వివరాలకు రైతుల భౌతిక స్వాధీనానికి మధ్య కూడా తేడాలున్నాయి. ఈ పరిస్థితుల్లో సర్వేను లోపభూయిష్టంగా నిర్వహిస్తే కొత్త వివాదాలు తలెత్తే ప్రమాదం ఉందని గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో సీసీఎల్ఏ తాజాగా స్పష్టమైన విధివిధానాలను విడుదల చేశారు.

సర్వేకు ముందస్తు ఏర్పాట్లు

రీసర్వే బృందాలు భూ భారతి పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసిన ఫీల్డ్ రిజిస్టర్లు, తాజా పహాణీ ప్రతులను వెంట తీసుకెళ్లాలి. ఫీల్డ్ రిజిస్టర్‌లోని ఒకటి నుంచి తొమ్మిది కాలమ్స్ వరకు క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా పూర్తి చేయాలి. పట్టాదారుల పేర్లు, సర్వే నంబర్లు, ఖాతా నంబర్లు, భూమి విస్తీర్ణాన్ని రికార్డులతో సరిపోల్చాలి. సర్వే ప్రారంభానికి ముందే తహశీల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించాలి. గ్రామంలో దండోరా వేయించి రైతులకు రీసర్వే ఉద్దేశం, విధానం గురించి వివరించాలి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులను కూడా భాగస్వాములను చేయాలి. క్షేత్రస్థాయి సర్వే తేదీకి కనీసం నాలుగు రోజుల ముందే సంబంధిత పట్టాదారులకు నోటీసులు అందించాలి. సర్వేకు రెండు రోజుల ముందు రైతులకు జెండాలు ఇచ్చి, తమ భూముల సరిహద్దు మూలల్లో వాటిని నాటించాలని సూచించాలి. ప్రభుత్వ భూముల సర్వే సమయంలో గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో ఫారం–9 సాధారణ నోటీసును ప్రదర్శించాలి. చెరువులు, కుంటలు, అటవీ భూములు, ఇతర శాఖలకు కేటాయించిన స్థలాలకు సంబంధించి ఆయా శాఖలకు ఫారం–10 నోటీసులు జారీ చేయాలి. వాటి సరిహద్దులను స్పష్టంగా గుర్తించాలి.

కొలతల వివరాలు వెంటనే తెలియజేయాలి

ప్రతి భూకమతం కొలతలు పూర్తయిన వెంటనే క్షేత్రస్థాయిలో గుర్తించిన వాస్తవ విస్తీర్ణాన్ని సంబంధిత పట్టాదారుకు తెలియజేయాలి. రెవెన్యూ రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి, సర్వేలో తేలిన విస్తీర్ణానికి మధ్య తేడాలుంటే వాటిని వెంటనే రైతు దృష్టికి తీసుకెళ్లాలి. తగిన వివరణ ఇచ్చేందుకు, సంబంధిత పత్రాలు సమర్పించేందుకు అవకాశం కల్పించాలి. దీనివల్ల సర్వే ఫలితాలపై రైతులకు స్పష్టత ఏర్పడుతుందని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఫీల్డ్ రిజిస్టర్‌లోని రీమార్కుల కాలమ్‌లో క్షేత్రస్థాయి పరిస్థితులను స్పష్టంగా నమోదు చేయాలి. విస్తీర్ణంలో మార్పులకు కారణాలు, ఉమ్మడి ఖాతాలు, ఎల్‌పీఎం వివరాలు, పేర్లలో తప్పులు, పట్టాదారు భూమిని స్వాధీనంలో ఉంచుకోని పరిస్థితులు తదితర అంశాలను పేర్కొనాలి. నమోదు చేసే వ్యాఖ్యలు నిర్దిష్టంగా, వాస్తవ పరిశీలనలకు అనుగుణంగా ఉండాలి. అస్పష్టమైన, ఆధారాలు లేని వ్యాఖ్యలకు తావివ్వకూడదు. ఈ వివరాలను అనంతరం భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయాలి.

ఆరు రకాల సమస్యలపై ప్రత్యేక దృష్టి

సర్వే సందర్భంగా రికార్డుల్లోని విస్తీర్ణానికి, భౌతికంగా కొలిచిన విస్తీర్ణానికి మధ్య పెరుగుదల, తగ్గుదల వంటి తేడాలను గుర్తించాలి. ఒకే ఖాతాకు సంబంధించి ఉమ్మడి ఎల్‌పీఎంలు ఉన్న కేసులు, ఒకే ఎల్‌పీఎం కలిగిన ఉమ్మడి ఖాతాలు, బహుళ ఎల్‌పీఎంలతో కూడిన ఉమ్మడి ఖాతాలను పరిశీలించాలి. పట్టాదారుల పేర్లలో వ్యత్యాసాలు, భూమి పట్టాదారు భౌతిక స్వాధీనంలో లేకపోవడం, పహాణీలో పేరు నమోదై ఉన్నప్పటికీ సర్వే సమయంలో సంబంధిత వ్యక్తి క్షేత్రస్థాయిలో కనిపించని సందర్భాలను కూడా ప్రత్యేకంగా నమోదు చేయాలి.

తహశీల్దార్లకు కీలక బాధ్యతలు

క్షేత్రస్థాయి నివేదికలు, డ్రాఫ్ట్ కోరిలేషన్ స్టేట్‌మెంట్లను తహశీల్దార్లు పరిశీలించి కేసులను వర్గీకరించాలి. విస్తీర్ణం సరిపోయినవి, తక్కువ లేదా ఎక్కువగా నమోదైనవి, పట్టాదారు స్వాధీనంలో లేనివి, పహాణీలో పేరు లేకున్నా భూమిని అనుభవిస్తున్నవి, సింగిల్, జాయింట్ ఖాతాలు, ఎల్‌పీఎం సమస్యలు తదితర అంశాలతో మొత్తం ఎనిమిది రకాల కేసులను గుర్తించాలి. ఈ పరిశీలనను మూడు నుంచి నాలుగు రోజుల్లో పూర్తి చేయాలి. రికార్డులకు, వాస్తవ విస్తీర్ణానికి మధ్య తేడాలున్న గ్రామాల్లో మూడు రోజులపాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి. తహశీల్దార్, గ్రామ పెద్దలు, సంబంధిత రైతులు, పొరుగు భూయజమానులతో సమావేశమై సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రయత్నించాలి. ఉమ్మడి ఖాతాలు, జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్న రైతులు పరస్పర అంగీకారంతో భూమిని విభజించుకుని వ్యక్తిగత ఖాతాలు పొందేలా ప్రోత్సహించాలి. ఆమోదించిన మార్పుల అనంతరం మండల సర్వేయర్ సెక్షన్ 9(2) కింద నోటీసులు జారీ చేస్తారు.

ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి తనిఖీలు

సెక్షన్ 9(2) నోటీసులు జారీ చేసిన తర్వాత అప్పీల్ గడువులో అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పర్యటించాలి. రైతులు లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించి, భౌతిక స్వాధీనానికి, రెవెన్యూ రికార్డులకు మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. అప్పీల్ సమయంలో వచ్చిన మార్పులు, ఉమ్మడి ఎల్‌పీఎంల విభజన, పరస్పర అంగీకారంతో చేపట్టిన విస్తీర్ణ సవరణలను సర్వే ఫైళ్లు, కోరిలేషన్ స్టేట్‌మెంట్లలో నమోదు చేయాలి. చట్టబద్ధమైన అప్పీల్ గడువు ముగిసి, అభ్యంతరాలన్నీ పరిష్కారమైన తర్వాత ఆర్డీఓ ముందస్తు అనుమతితో సర్వే, భూ రికార్డుల అసిస్టెంట్ డైరెక్టర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సెక్షన్ 13 కింద జిల్లా గెజిట్‌లో తుది నోటిఫికేషన్ ప్రచురిస్తారు.

భూ భారతి పోర్టల్‌లో రికార్డుల నవీకరణ

తుది గెజిట్ నోటిఫికేషన్ వెలువడిన వెంటనే సంబంధిత తహశీల్దార్ తెలంగాణ భూ భారతి చట్టం–2025లోని సెక్షన్ 4 నిబంధనల ప్రకారం రెవెన్యూ రికార్డులను స్వయంచాలకంగా నవీకరించాలి. రీసర్వేలో ఖరారైన మార్పులన్నీ ఆర్వోఆర్ రికార్డుల్లో సక్రమంగా నమోదయ్యేలా చూడాలి. భూ భారతి పోర్టల్‌లోనూ ఆ వివరాలు ప్రతిబింబించాలని సీసీఎల్ఏ ఆదేశించారు. విస్తీర్ణాల సవరణతోపాటు భూ రికార్డుల్లో మార్పులు చేసే ప్రక్రియ చట్టంలోని నిబంధనలు, నిర్దేశిత విధానాలకు అనుగుణంగానే జరగాలని స్పష్టం చేశారు.

దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్న రాహుల్: కిషన్‌రెడ్డి

- అంతర్జాతీయ వేదికలపై నిరాధార ఆరోపణలు
- భారత ఆర్థిక ప్రగతిపై తప్పుడు ప్రచారం
- మోదీ నాయకత్వంలో పెరిగిన దేశ ప్రాధాన్యం
- తెలంగాణలో బీజేపీ బలోపేతంపై ధీమా



హైదరాబాద్, నవంబర్ 21 (సమయం న్యూస్): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై రాజకీయ విమర్శలు చేయడంలో తప్పులేదని, అయితే రాజ్యాంగబద్ధ సంస్థలు, సైనిక వ్యవస్థలు, ఆర్థిక రంగంపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ద్వారా 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని కించపరచకూడదని హితవు పలికారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరుసగా మూడుసార్లు ప్రజలు కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేసినా ఆ పార్టీ వైఖరిలో మార్పు రావడం లేదని కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో పరాజయాలు ఎదురవుతున్నా రాహుల్ గాంధీ ప్రజల ఆలోచనలను అర్థం చేసుకోవడం లేదని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే నిర్మాణాత్మక సూచనలు చేయాల్సింది పోయి, విమర్శలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. కొలంబియా యూనివర్సిటీలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. భారత ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉందని, దేశం ఆర్థిక విపత్తు దిశగా వెళ్తోందని చెప్పడం సరికాదని కిషన్ రెడ్డి అన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నా భారత్ అభివృద్ధి పథంలో కొనసాగుతోందని పేర్కొన్నారు. రక్షణ, తయారీ, సెమీకండక్టర్, ఆటోమొబైల్ రంగాల్లో ఎగుమతులు పెరుగుతున్నాయని, అంతర్జాతీయ సంస్థలు సైతం భారత ప్రగతిని గుర్తిస్తున్నాయని తెలిపారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలతో దేశీయ తయారీ రంగం బలోపేతమైందన్నారు. కరోనా సమయంలో వెంటిలేటర్లు, మాస్కులు, ఆక్సిజన్ సిలిండర్లు, ఇతర వైద్య పరికరాల కొరతను అధిగమించి దేశంలోనే వాటి ఉత్పత్తి చేపట్టామని గుర్తుచేశారు. భారతదేశంలో తయారైన వ్యాక్సిన్లను 80 దేశాలకు సరఫరా చేసినట్లు వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రపంచ దేశాల మధ్య భారత్ గౌరవం, ప్రాధాన్యం పెరిగాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. జీ20, బ్రిక్స్, క్వాడ్, ఎస్‌సీఓ వంటి అంతర్జాతీయ వేదికల్లో దేశం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనిక సామర్థ్యం ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. ప్రవాస భారతీయుల్లోనూ దేశంపై గౌరవం పెరిగిందన్నారు. చైనాతో సంబంధాల విషయంలో కాంగ్రెస్ గత పాలనను ప్రశ్నించిన ఆయన.. అక్సాయ్‌చిన్ ప్రాంతం చైనా ఆధీనంలోకి వెళ్లిన పరిణామాన్ని ప్రస్తావించారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ పాలనకు ప్రాధాన్యం ఇస్తోందని, దేశాన్ని పాలించడం తమ కుటుంబ హక్కుగా భావిస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని, ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందిన వారికే పాలించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని ఆరోపించారు. పార్లమెంటు, సుప్రీంకోర్టు, రాజ్యాంగబద్ధ సంస్థలను బలహీనపరిచేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. మోదీపై రాజకీయ వ్యతిరేకతను దేశ వ్యతిరేక వైఖరిగా మార్చడం సరికాదన్నారు. దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ప్రజలు అంగీకరించరని వ్యాఖ్యానించారు.

తెలంగాణలో బీజేపీకి ఆదరణ పెరుగుతోంది

తెలంగాణలో బీజేపీకి బలం లేదని విమర్శించే వారికి గత ఎన్నికల్లో సాధించిన ఎనిమిది ఎంపీ స్థానాలు, రెండు ఎమ్మెల్సీ స్థానాలే సమాధానమని కిషన్ రెడ్డి అన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. కుటుంబ పాలన, అవినీతి, అక్రమ సంపాదనకు ఆ రెండు పార్టీలు ప్రతీకలుగా మారాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ సదుపాయాల విస్తరణ, మరుగుదొడ్ల నిర్మాణం, ఉచిత బియ్యం పంపిణీ, ఉచిత వైద్యం, శాంతిభద్రతల మెరుగుదల వంటి కార్యక్రమాలతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ రాజకీయ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

మెడికల్ టూరిజం గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

- ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, హాస్పిటల్స్ సమన్వయంతో పనిచేయాలి
- ప్రభుత్వ దవాఖానల్లోనూ మెడికల్ టూరిజం సేవలు
- కేన్సర్ చికిత్స కోసం ప్రతి జిల్లాలో కీమోథెరపీ కేంద్రాలు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): ఆరోగ్య రంగంలో తెలంగాణను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, హాస్పిటల్స్ యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన 'గ్లోబల్ సమ్మిట్ హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్' సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మెడికల్ టూరిజం అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, వైద్య విద్య, నైపుణ్యాల పెంపుపై ప్రముఖ వైద్య నిపుణులతో మంత్రి విస్తృతంగా చర్చించారు. ప్రైవేటు రంగంతో పాటు ప్రభుత్వ దవాఖానల్లోనూ మెడికల్ టూరిజం సేవలను విస్తరిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. సనత్‌నగర్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్, నిమ్స్, అల్వాల్ టిమ్స్, కొత్తపేట టిమ్స్ దవాఖానల్లో ప్రత్యేకంగా ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం వార్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మెడికల్ టూరిజం కోసం ఆరోగ్యశాఖలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలన్న వైద్యుల విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. విదేశీ రోగులకు ఒకే వేదికపై అన్ని సేవలు అందేలా వ్యవస్థను రూపొందిస్తామని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతం చేయడంలో హెల్త్‌కేర్ రంగ ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రైవేటు దవాఖానల వైద్యులు ముందుకొచ్చారు. జాయింట్ రీప్లేస్‌మెంట్, న్యూరో సర్జరీ, కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగాల్లో కొత్తగా ప్రభుత్వ సర్వీసులో చేరే వైద్యులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని కిమ్స్-సన్‌షైన్ ఎండీ డాక్టర్ గురువా రెడ్డి, ఇతర వైద్యులు ప్రకటించారు. అలాగే ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో హానరరీ ప్రొఫెసర్లుగా సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రైవేటు రంగంలోని నిపుణుల సేవలను తప్పకుండా వినియోగించుకుంటామని మంత్రి పేర్కొన్నారు. జిల్లా స్థాయిలోనే కేన్సర్ చికిత్స అందించేందుకు ప్రతి జిల్లాలో కీమోథెరపీ కేంద్రాలు, డయాలసిస్ నెట్‌వర్క్‌ను విస్తరించడంపై



వైద్యులు ప్రభుత్వాన్ని అభినందించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫార్మా వైస్ ప్రెసిడెంట్, కౌన్సిల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కొండపల్లి సాహితి, ఫిక్కీ ప్రతినిధి డాక్టర్ విజయ్ కుమార్, రెయిన్‌బో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్, యూఎన్ మాజీ అధికారి డాక్టర్ శివ దుబిశెట్టి, యశోద హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ దశరథ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు జలద్రోహం చేస్తున్న రేవంత్



- ఏపీకి వెయ్యి టీఎంసీల నీళ్లు వదిలేశారు
- కృష్ణా జలాల వాటాలో కాంగ్రెస్‌దే అన్యాయం
- పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తున్నారు
- అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?
- సీఎం రేవంత్‌కు హరీశ్ సవాల్

హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): "ఏపీకి వెయ్యి టీఎంసీల నీళ్లు వదిలి తెలంగాణకు జలద్రోహం చేసిన రేవంత్ రెడ్డి.. రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టారు" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనలో సాగునీటి రంగం నిర్లక్ష్యానికి గురైందని, రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడటానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సిద్దిపేట సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, ప్రజా సమస్యల గురించి మాట్లాడకుండా కేసీఆర్, కేటీఆర్, తనపై వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యమిచ్చారని అన్నారు. కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు 299:512 టీఎంసీల వాటాతో అన్యాయం చేసింది గత కాంగ్రెస్ ప్రభుత్వమేనని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ వాటాల ఒప్పందంపై బీఆర్ఎస్ సంతకం చేసిందని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. తెలంగాణ ఏర్పడిన వెంటనే కేసీఆర్ నీటి హక్కుల కోసం పోరాటం ప్రారంభించారని, కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు కోసం కేంద్రంతో పాటు సుప్రీంకోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. నాగార్జునసాగర్ కుడివైపు ఏపీ చేపడుతున్న టన్నెల్ నిర్మాణాన్ని అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. "కుప్పానికి నీళ్లు.. పాలమూరుకు కన్నీళ్లా?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేవాదుల, కల్వకుర్తి, సీతారామ ప్రాజెక్టుల్లో నీటిని ఎత్తిపోసే అవకాశమున్నా వినియోగించుకోవడం లేదన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో ప్యాకేజీ-3 పనులు పూర్తిచేస్తే 50 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చని, అయినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కల్వకుర్తి, నెట్టంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను కేసీఆర్ హయాంలో అభివృద్ధి చేసి పది లక్షల ఎకరాలకు నీరందించామని చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టుల ద్వారా ఎత్తిపోసిన, దిగువకు వదిలిన నీటి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. సన్నవడ్ల కొనుగోళ్లు, బోనస్ చెల్లింపులపై స్పష్టత ఇవ్వాలని కోరారు. కరువు పరిస్థితులపై కేంద్రాన్ని ప్రశ్నించి సహాయక బృందాలను రాష్ట్రానికి రప్పించడంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో అమలైన రైతు బీమా, కేసీఆర్ కిట్, దళిత బంధు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, కంటి వెలుగు తదితర పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. సిద్దిపేట అభివృద్ధికి గతంలో మంజూరైన రూ.1,070 కోట్ల నిధులను రద్దు చేసిందని పేర్కొన్నారు. "సిద్దిపేటలో నాపై పోటీ చేసి గెలిచి చూపించాలి" అంటూ రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్ విసిరారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ పోరాటం చేసిందని, అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసెంబ్లీని స్తంభింపజేసి పదవులకు రాజీనామా చేశామని వివరించారు. నాయిని నర్సింహారెడ్డిపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి సాగునీటి ప్రాజెక్టులు, కరువు పరిస్థితులపై చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. తెలంగాణ ప్రయోజనాల కోసం న్యాయపోరాటంతో పాటు ప్రజా ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, సీనియర్ నాయకుడు మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

'పండబెట్టి తొక్కుతా' వ్యాఖ్యలు బాధించాయి

సీఎం వ్యాఖ్యలపై కోమటిరెడ్డి అసంతృప్తి

ప్రజాధనాన్ని కొందరి నియోజకవర్గాలకే తరలించడం సరికాదు

అన్ని నియోజకవర్గాలకు సమానంగా నిధులివ్వాలి

ముఖ్యమంత్రి హోదాకు తగిన భాష ఉండాలి



హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): ప్రభుత్వ ఖజానాలోని ప్రజాధనాన్ని కొందరు తమ సొంత నియోజకవర్గాలకే తరలించుకుపోవడం సరికాదని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. సిద్దిపేట సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మాట్లాడే భాష, వ్యవహారశైలి బాధ్యతాయుతమైన పదవికి తగినట్లుగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి, మంత్రులుగా ఉన్నంత మాత్రాన తమ నియోజకవర్గాలకే వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించుకోవడం సమంజసం కాదన్నారు. నిధుల కేటాయింపులో అసమానతలను ప్రశ్నించకూడదా అని నిలదీశారు. అభివృద్ధిలో వెనుకబడిన మునుగోడుతో పాటు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు సమానంగా నిధులు కేటాయించాలని కోరారు. తాను లేవనెత్తుతున్న అంశాలన్నీ తనను ఎన్నుకున్న ప్రజలకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనేనని స్పష్టం చేశారు. కొడంగల్‌కు నిధుల కేటాయింపుపై ప్రశ్నించినందుకు 'పండబెట్టి తొక్కుతా' అంటూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని రాజగోపాల్ రెడ్డి అన్నారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి భాష ఉపయోగించడం సరికాదని, ఈ విషయాన్ని ఇప్పటికే ఖండించానని గుర్తుచేశారు. అధికారంలో ఉన్నామనే కారణంతో ఇష్టానుసారంగా మాట్లాడకూడదని హితవు పలికారు. ప్రజాధనాన్ని నిజాయితీగా, ధర్మబద్ధంగా ఖర్చు చేసేలా ఆలోచించాలని రేవంత్ రెడ్డికి సూచించారు. ఆయనకు మంచి బుద్ధిని ప్రసాదించాలని అయ్యప్ప స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ఎల్లుండి రాష్ట్రానికి నితిన్ నబీన్

కరీంనగర్‌లో బీజేపీ మహా పాదయాత్రకు హాజరు

ఉత్తర తెలంగాణలో పార్టీ బలోపేతంపై దృష్టి

నిజామాబాద్‌లోనూ పాదయాత్రకు అరవింద్ పట్టు



హైదరాబాద్, నవంబర్ 20(సమయం న్యూస్): బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఈ నెల 23న తెలంగాణకు రానున్నారు. కరీంనగర్‌లో మధ్యాహ్నం నిర్వహించనున్న మహా పాదయాత్రలో ఆయన పాల్గొననున్నారు. ఉత్తర తెలంగాణలో పార్టీని బలో పేతం చేసే లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. నబీన్ రాకతో కార్యకర్తల్లో ఉత్సాహం పెరుగుతుందని నేతలు భావి స్తున్నారు. ఇదిలా ఉండగా, అదే రోజు నిజామాబాద్‌లోనూ పాదయాత్ర నిర్వహించేందుకు సమయం కేటాయించాలని ఎంపీ ధర్మపురి అరవింద్ కోరుతున్నారు. 23న అక్కడ కూడా పాదయాత్ర చేపట్టాలని ఆయన పట్టుబడుతున్నారు. దీంతో నితిన్ నబీన్ పర్యటనలో నిజామాబాద్ కార్యక్రమానికి చోటు కల్పించే అంశంపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అక్రమ అండాల విక్రయాల కేసులో పోలీసుల దూకుడు

ఇద్దరు నిందితుల కస్టడీకి పిటిషన్

మరో ముగ్గురిపై కొత్త కేసు నమోదు

ఒక్కో అండం రూ.3 లక్షలకు విక్రయం

47 మంది మహిళల నుంచి అండాల సేకరణ

హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): అక్రమ అండాల సేకరణ, విక్రయాల వ్యవహారంపై మలక్‌పేట్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో అరెస్టయిన ఇద్దరు నిందితులను ఐదు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. సద్గురు హెల్త్ కేర్ బ్రాంచ్ ఇన్ ఛార్జ్ ఆనంద్ రాజు, అడ్మిన్ సుభానీ షేక్‌లను మరింత లోతుగా విచారిస్తే అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితులుగా ఉన్న అమిత్ శర్మ, నిఖిత్ పర్వీన్, దుర్గ ప్రసాద్‌లపై మలక్‌పేట్ పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న వీరిని ఈ కేసులోనూ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ నాంపల్లి కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. అక్రమ అండాల వ్యాపారానికి సంబంధించి దర్యాప్తులో కీలక వివరాలు బయటపడ్డాయి. మొత్తం 66 మంది మహిళల్లో 47 మంది నుంచి అండాలను సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. వీటిని సంతానం లేని దంపతులకు ఒక్కొక్కటి రూ.3 లక్షల చొప్పున విక్రయించినట్లు తేల్చారు. సద్గురు హెల్త్ కేర్ డైరెక్టర్ గేదెల దుర్గారావు నేతృత్వంలో ఈ వ్యవహారం సాగినట్లు పోలీసులు నిర్ధారించారు.



అందుబాటులోకి స్వదేశీ బర్డ్ ఫ్లూ వ్యాక్సిన్

భోపాల్‌లో ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్!



భోపాల్, నవంబర్ 20 (సమయం న్యూస్): దేశంలోని కోళ్ల పరిశ్రమకు ముప్పుగా మారిన బర్డ్ ఫ్లూ వ్యాధి నియంత్రణలో భారత శాస్త్రవేత్తలు కీలక పురోగతి సాధించారు. అత్యంత ప్రమాదకరమైన హెచ్5ఎన్1 వైరస్‌ను ఎదుర్కొనేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి టీకాను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భోపాల్‌లో ఆవిష్కరించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి పరిధిలోని జాతీయ అత్యున్నత భద్రతా పశువ్యాధుల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ఈ టీకాను రూపొందించారు. హెచ్5ఎన్1 వైరస్‌లోని క్లేడ్ 2.3.2.1ఏ రకాన్ని ఎదుర్కొనేందుకు దీనిని అభివృద్ధి చేసినట్లు అధికారులు వెల్లడించారు. పక్షుల్లో వేగంగా వ్యాపించే బర్డ్ ఫ్లూ కారణంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కోళ్ల పరిశ్రమ తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంది. వ్యాధి వ్యాప్తి చెందిన ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లను నిర్మూలించాల్సి రావడంతో పెంపకందారుల జీవనోపాధిపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా స్వదేశీ పరిజ్ఞానంతో టీకాను అభివృద్ధి చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వ్యాధి నివారణ చర్యల్లో ఈ టీకా కీలకంగా ఉపయోగపడుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ కోళ్ల పరిశ్రమ పరిరక్షణతోపాటు పెంపకందారుల జీవనోపాధిని బలోపేతం చేయడంలో స్వదేశీ టీకా అభివృద్ధి ముఖ్యమైన ముందడుగని పేర్కొన్నారు. పరిశోధనల్లో విజయం సాధించిన శాస్త్రవేత్తలు, పరిశోధకులను అభినందించారు. దేశీయ పశువైద్య పరిశోధన సామర్థ్యానికి ఈ ఆవిష్కరణ నిదర్శనమని తెలిపారు. టీకా వినియోగం విస్తరించినప్పుడు బర్డ్ ఫ్లూ వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రఫేల్ ఫైటర్ జెట్ల అదృశ్యం అంటూ 'ఫ్లైట్ గ్లోబల్' డొల్ల కథనం..

తిప్పికొట్టిన మాజీ ఎయిర్ మార్షల్ తివారీ!

న్యూఢిల్లీ, నవంబర్ 21 (సమయం న్యూస్): ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళానికి చెందిన నాలుగు రఫేల్ యుద్ధవిమానాలు అదృశ్యమయ్యాయంటూ బ్రిటన్‌కు చెందిన విమానయాన పత్రిక 'ఫ్లైట్ గ్లోబల్' ప్రచురించిన కథనం వివాదానికి దారితీసింది. ఈ కథనాన్ని భారత వైమానిక దళ మాజీ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ తీవ్రంగా ఖండించారు. ప్రచురించిన గణాంకాలను, ఆధారాలను మరోసారి పరిశీలించుకోవాలని సామాజిక మాధ్యమం ద్వారా సూచించారు. భారత్ ఫ్రాన్స్ నుంచి మొత్తం 36 రఫేల్ యుద్ధవిమానాలను కొనుగోలు చేయగా, ఫ్లైట్ గ్లోబల్ తాజా ప్రపంచ వైమానిక దళాల వివరాల్లో భారత్ వద్ద 32 విమానాలే ఉన్నట్లు పేర్కొంది. అయితే ఈ సంఖ్యలో వ్యత్యాసం నాలుగు విమానాలు కూలిపోయాయనడానికి స్వతంత్ర ఆధారం కాదని గుర్తించాల్సి ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత రఫేల్ యుద్ధవిమానాలను కూల్చివేశామంటూ పాకిస్థాన్ చేసిన ప్రకటనలను తివారీ ప్రస్తావించారు. అప్పట్లో కొన్ని విమానాల గుర్తింపు సంఖ్యలను కూడా వెల్లడించారని, అయితే ఆ సంఖ్యలతో ఉన్న విమానాలు అనంతరం వివిధ అంతర్జాతీయ విన్యాసాల్లో పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత వైమానిక దళ మహిళా రఫేల్ పైలట్ శివాంగి సింగ్‌ను పాకిస్థాన్ బందీగా పట్టుకుందంటూ గతంలో వచ్చిన వార్తలను కూడా గుర్తుచేశారు. ఆ ప్రచారాన్ని భారత వైమానిక దళం అప్పట్లోనే ఖండించిందన్నారు. అనంతరం అంబాలా వైమానిక స్థావరంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి శివాంగి సింగ్ కనిపించిన విషయాన్ని ప్రస్తావించారు. మరోవైపు ఫ్లైట్ గ్లోబల్ కథనానికి సమాచారం అందించినట్లు పేర్కొంటున్న బ్రిటన్ విమానయాన రచయిత అలన్ వార్న్‌పై సామాజిక మాధ్యమాల్లో పలు ఆరోపణలు వెలువడ్డాయి. పాకిస్థాన్‌కు అనుకూలంగా కథనాలు రాసినందుకు ఆయనకు నగదు చెల్లించారంటూ కొన్ని ఖాతాలు ప్రచారం చేస్తున్నప్పటికీ, ఆ ఆరోపణలకు స్వతంత్ర ధ్రువీకరణ లేదు. ఇదిలా ఉండగా, ఫ్లైట్ గ్లోబల్ ప్రచురించిన గణాంకాలను పాకిస్థాన్ మీడియా తమ దేశం గతంలో చేసిన ప్రకటనలకు మద్దతుగా ప్రస్తావిస్తోంది. అయితే విమానాల సంఖ్యలో తేడా, యుద్ధంలో జరిగిన నష్టాలు, వాటికి సంబంధించిన అధికారిక నిర్ధారణ వేర్వేరు అంశాలు కావడంతో ఈ వివాదంపై స్పష్టమైన ఆధారాలకు ప్రాధాన్యం ఏర్పడింది.

వాహనాలపై కులం పేరు కనిపిస్తే చర్యలే!

కుల గుర్తులు, పేర్లు, చిహ్నాల ప్రదర్శనపై గుజరాత్ ప్రభుత్వం నిషేధం

గాంధీనగర్, నవంబర్ 21 (సమయం న్యూస్): ప్రైవేటు వాహనాలపై కులాన్ని సూచించే పేర్లు, గుర్తులు, చిహ్నాలు, అంకెల ప్రదర్శనపై గుజరాత్ ప్రభుత్వం నిషేధం విధించింది. ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలతోపాటు బస్సులు, లారీలకు కూడా ఈ నిబంధనలు వర్తించనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఓడరేవులు, రవాణా శాఖ నవంబర్ 17న గుజరాత్ మోటారు వాహనాల మూడో సవరణ నిబంధనలు--2026ను అధికారికంగా ప్రకటించింది. వాహనాలపై కుల గుర్తింపును ప్రదర్శించడాన్ని నియంత్రించేందుకు మోటారు వాహనాల నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. 1989 నాటి గుజరాత్ మోటారు వాహనాల నిబంధనల్లోని 125(1)వ నిబంధనను ప్రభుత్వం సవరించింది. గతంలో ఉన్న 'ప్రకటన పరికరాలు, బొమ్మలు' అనే పదాలకు అదనంగా 'కుల సూచికలు' అనే పదాన్ని చేర్చింది. అలాగే 138(2)వ నిబంధన తర్వాత కొత్తగా మూడో ఉపనిబంధనను ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ప్రభుత్వం సాధారణ లేదా ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా అనుమతించిన సందర్భాలు మినహా ప్రైవేటు వాహనాలపై ప్రకటనలు, కులాన్ని సూచించే పేర్లు, చిహ్నాలు, బొమ్మలు, ఇతర రాతలను ప్రదర్శించరాదు. దీంతో వాహనాలపై కుల గుర్తింపును చాటే పదాలు, సంకేతాల ప్రదర్శన కూడా మోటారు వాహనాల నిబంధనల పరిధిలోకి వచ్చింది. ఈ సవరణలకు సంబంధించి ప్రభుత్వం తొలుత జూన్ 11న ముసాయిదా నిబంధనలను ప్రత్యేక గెజిట్‌లో ప్రచురించింది. ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు 30 రోజుల గడువు ఇచ్చింది. నిర్దేశిత సమయంలో ఎలాంటి అభ్యంతరాలు అందకపోవడంతో నవంబర్ 17న తుది నిబంధనలను ప్రకటించి అమల్లోకి తీసుకొచ్చింది. కొత్త నిబంధనలతో ప్రైవేటు వాహనాలపై కుల గుర్తింపును ప్రదర్శించే విధానానికి అడ్డుకట్ట వేయాలని గుజరాత్ ప్రభుత్వం నిర్ణయించింది.







సంస్కృతుల కలయికే.. ప్రపంచ శాంతికి రక్ష

- **దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడులతో సంబంధాలు బలోపేతం**
- **షాంఘై సహకార సంస్థ నాగరికతల సంభాషణ వేదికలో ప్రధాని మోదీ**
- **ప్రాచీన గ్రంథాలు, చారిత్రక పత్రాలను అంకెల రూపంలో భద్రపరచాలని సూచన**
- **బౌద్ధ క్షేత్రాలు, ప్రాచీన వాణిజ్య మార్గాలతో పర్యాటకాభివృద్ధికి పిలుపు**

న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్): ప్రపంచ దేశాల మధ్య శాంతికి సాంస్కృతిక అనుసంధానమే బలమైన గ్యారంటీ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శుక్రవారం ఢిల్లీలోని చారిత్రక పురానా ఖిలాలో తొలి షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) నాగరికతల సంభాషణ వేదికను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. వివిధ దేశాల మధ్య జరిగే సాంస్కృతిక మార్పిడులు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ప్రపంచాన్ని ఏకం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీఓ సభ్య దేశాల మధ్య సాంస్కృతిక సహకారాన్ని మరింత విస్తరించేందుకు మోదీ పలు కీలక ప్రతిపాదనలు చేశారు. ఎస్‌సీఓ దేశాల సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడంలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని ప్రధాని మోదీ సూచించారు. అనేక గొప్ప సాహిత్య రచనలు పరిమిత భాషల్లోనే అందుబాటులో ఉన్నాయని, వాటిని ఇతర భాషల్లోకి అనువదించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రస్తుత కాలంలో గతంలో ఎన్నడూ లేనన్ని సాంకేతిక వనరులు అందుబాటులో ఉన్నాయని, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే, సభ్య దేశాల్లోని మ్యూజియంలు, గ్రంథాలయాలు, ఆర్కైవ్‌లలో వేల ఏళ్ల చరిత్రకు సంబంధించిన విలువైన సంపద ఉందని గుర్తుచేశారు. ప్రాచీన మ్యానుస్క్రిప్ట్‌లు, అరుదైన గ్రంథాలు, చారిత్రక పత్రాలు, కళాఖండాలు ఆయా నాగరికతల మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తాయని, వాటిని డిజిటలైజ్ చేయడంతో పాటు పరస్పరం అనుపదించుకునేందుకు సభ్య దేశాలు కలిసి పనిచేయాలని సూచించారు. సాంస్కృతిక పర్యాటక రంగంలోనూ ఎస్‌సీఓ దేశాల మధ్య సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సభ్య దేశాల్లో సిల్క్ రూట్స్, ఉమ్మడి బౌద్ధ వారసత్వానికి సంబంధించిన అనేక చారిత్రక ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. వాటన్నింటినీ అనుసంధానిస్తూ ప్రత్యేక హెరిటేజ్ సర్క్యూట్లు, సాంస్కృతిక పర్యాటక మార్గాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. తద్వారా ఆయా దేశాల మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ప్రజలు మరింత లోతుగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

తిరుపరంకుండ్రంలో దీపారాధనకు సుప్రీంకోర్టు అనుమతి!

నవంబర్ 24న ఒక్కసారి మాత్రమే దీపం వెలిగించేందుకు అవకాశం

భక్తుల ప్రవేశానికి అనుమతి లేదు.. పరిమిత బృందానికే చాన్స్

దర్గా, మసీదు ప్రార్థనలకు ఆటంకం కలగకూడదని స్పష్టీకరణ



న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్): తమిళనాడులోని తిరుపరంకుండ్రం కొండపై ఉన్న దర్గా సమీపంలోని దీపస్తంభం వద్ద కార్తీక దీపం వెలిగించే వివాదంపై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ 24న ఒక్కసారి మాత్రమే కొన్ని షరతులతో దీపం వెలిగించేందుకు అనుమతించింది. సాధారణ భక్తులకు కూడా ప్రవేశం కల్పిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన విస్తృత ఆదేశాల అమలుపై నిలుపుదల విధించింది. ఆలయ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో కూడిన పరిమిత బృందం మాత్రమే దీపారాధనలో పాల్గొనాలని స్పష్టం చేసింది. దీపారాధనలో పాల్గొనే బృందం సంఖ్యను ఆలయ కార్యనిర్వహణాధికారి, భారత పురావస్తు శాఖ అధికారులు, పోలీసు కమిషనర్‌తో సంప్రదించి మదురై జిల్లా కలెక్టర్ నిర్ణయించాలని న్యాయస్థానం ఆదేశించింది. వేడుక ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించాలని, పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని సూచించింది. అవసరమైతే కేంద్ర రిజర్వు పోలీసు బలగాలను కూడా వినియోగించుకోవచ్చని పేర్కొంది. కార్యక్రమం ముగిసిన మూడు రోజుల్లోగా ఉత్తర్వుల అమలుపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది. కొండపై ఉన్న దర్గా, మసీదుల్లో సంప్రదాయ ప్రార్థనలకు ఎలాంటి ఆటంకం కలగకూడదని సుప్రీంకోర్టు ప్రత్యేకంగా స్పష్టం చేసింది. ప్రార్థనా స్థలాలకు వెళ్లే మార్గాలను అడ్డుకోరాదని సూచించింది. ఒక్కరోజు దీపారాధనకు ఇచ్చిన అనుమతిని అదనపు ప్రవేశ హక్కుగా గానీ, కొండపై యాజమాన్య లేదా నియంత్రణ హక్కుగా గానీ పరిగణించరాదని తేల్చిచెప్పింది. మతపరమైన సంప్రదాయాలు, యాజమాన్య హక్కులకు సంబంధించిన ప్రధాన వివాదాలను తదుపరి విచారణకు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల అనంతరం మదురైలోని ఆలయం వెలుపల హిందూ మున్నాని, బీజేపీ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. అయితే దీపారాధనకు అనుమతిస్తూనే ప్రజల ప్రవేశాన్ని నియంత్రించడం, ఇతర మతాల ప్రార్థనలకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించడం ద్వారా న్యాయస్థానం శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చింది.



భారత్‌కు పాక్ మంత్రి రాక

మోదీ సర్కారుపై విపక్షాల తీవ్ర విమర్శలు!

న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్): ఢిల్లీలో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమావేశం కోసం పాకిస్థాన్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ భారత్‌కు రావడంతో రాజకీయ దుమారం చెలరేగింది. ఈ క్రమంలో కేంద్రం అనుసరిస్తున్న విదేశాంగ విధానాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత సమయంలో ముసాదిక్ మాలిక్ భారత్‌పై తీవ్ర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. 'మా నీళ్లను ముట్టుకుంటే చేతులు నరికేస్తాం' అంటూ ఆయన అప్పట్లో హెచ్చరికలు చేశారు. అయితే ఇప్పుడు అదే ముసాదిక్ మాలిక్ భారత్‌లో పర్యటించడం వివాదానికి దారితీసింది. బీజేపీ విదేశాంగ విధానం పూర్తిగా గందరగోళమయంగా ఉందని సమాజ్‌వాది పార్టీ నాయకుడు ఫక్రుల్ హసన్ విమర్శించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ సైతం ముసాదిక్ మాలిక్ రాకపై సెటైర్లు పేల్చింది. ఉగ్రవాదానికి ఎప్పుడూ వ్యతిరేకమని చెప్పే బీజేపీ, ఇప్పుడు పాకిస్థాన్ మంత్రిని స్వాగతిస్తోందని చురకలంటించింది. విదేశీ వ్యవహారాల అంశంలో కేంద్రం అయోమయ స్థితిలో ఉందని, భారతీయ క్రికెటర్లను పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఆడాలని కోరే బీజేపీ.. మరోవైపు పాక్ మంత్రులకు ఆహ్వానం పలుకుతోందని ఇండియా కూటమి నాయకుడు సురేంద్ర రాజ్‌పూత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గందరగోళంలో ఉన్న ప్రధానమంత్రి మోదీ ఒత్తిడిలో పనిచేస్తున్నట్లున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారి మాట్లాడుతూ.. పాకిస్థాన్ వాతావరణ శాఖ మంత్రిపై మండిపడ్డారు. గతంలో ముసాదిక్ మాలిక్ చేసిన వ్యాఖ్యలు ఉగ్రవాదుల హెచ్చరికలకు ఏమాత్రం తీసిపోవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, నవంబర్ 20 నుంచి 22 వరకు ఢిల్లీలో ఎస్‌సీఓ నాగరికతల సంభాషణ సమావేశం జరగనుంది. ఇందులో భారత్, చైనా, రష్యా, పాకిస్థాన్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్ దేశాలు పాల్గొంటున్నాయి.

సీఈసీ, ఈసీ నియామక చట్టంపై విస్తృత విచారణ

ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి బాధ్యత

రీకాల్ పిటిషన్‌పై విడిగా విచారణకు నిరాకరణ

జస్టిస్ శర్మ పదవీ విరమణపై సీజేఐ స్పష్టత



న్యూఢిల్లీ, నవంబర్ 20: ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం-2023 రాజ్యాంగబద్ధతపై దాఖలైన పిటిషన్ల విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక స్పష్టత ఇచ్చింది. గతంలో ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం వెలువరించిన భిన్నాభిప్రాయాల తీర్పును వెనక్కి తీసుకోవాలంటూ దాఖలైన రీకాల్ పిటిషన్‌ను ప్రత్యేకంగా విచారించేందుకు నిరాకరించింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనమే పరిశీలిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇందులో జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన కూడా సభ్యులుగా ఉన్నారు. రీకాల్ దరఖాస్తుతో పాటు కేసును విస్తృత ధర్మాసనానికి నివేదించడంపై ఉన్న అభ్యంతరాలనూ అదే ధర్మాసనం విచారిస్తుందని తెలిపింది. ఈ కేసులో సెప్టెంబర్ 23న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం భిన్నాభిప్రాయాలతో తీర్పు వెలువరించింది. ఈ తీర్పును రీకాల్ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. దీనిని గతంలో విచారణ జరిపిన ధర్మాసనం ముందే చేపట్టాలని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోరారు. అయితే జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ వచ్చే వారం పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ప్రస్తుత ధర్మాసనమే విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. భూషణ్ విజ్ఞప్తిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్.. సంబంధిత న్యాయమూర్తి పదవీ విరమణ చేసినా ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం రీకాల్ పిటిషన్‌ను విచారించవచ్చని స్పష్టం చేశారు. ఈ అంశంపై విడిగా విచారణ జరపాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం 2023లో ఎన్నికల కమిషనర్ల నియామకానికి కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధాని నామినేట్ చేసిన కేంద్ర కేబినెట్ మంత్రి సభ్యులుగా ఉండే కమిటీ నియామకాలకు సిఫార్సులు చేస్తుంది. అంతకుముందు ఈ ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా స్థానం ఉండేది. కొత్త చట్టం ద్వారా ఆ స్థానాన్ని తొలగించడాన్ని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ చట్టం రాజ్యాంగబద్ధతపై ఐదుగురు సభ్యుల ధర్మాసనం తుది విచారణ చేపట్టనుంది. రీకాల్ పిటిషన్, రిఫరెన్స్ ఉత్తర్వులపై అభ్యంతరాలు కూడా ఇదే ధర్మాసనం పరిశీలించనుండటంతో తదుపరి విచారణపై ఆసక్తి నెలకొంది.

దిగొచ్చిన పసిడి

ఒక్కరోజే బంగారం రూ.5వేలపైగా..

వెండి రూ.10వేలు తగ్గింపు

ఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్): దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా పతనమవుతున్నాయి. హైదరాబాద్ విపణిలో శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయానికి 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పసిడి ధర ఏకంగా రూ.1.30లక్షల కిందకు పడిపోయి రూ.1,27,900కు దిగొచ్చింది. క్రితం రోజు ముగింపుతో (రూ.1.33లక్షలు) పోలిస్తే పుత్తడి ధర దాదాపు రూ.5300 మేర తగ్గడం విశేషం. ఇక, వెండి ధర కూడా భారీగానే దిగొచ్చింది. కేజీ ధర రూ.1,54,680 పలికింది. క్రితం రోజుతో (రూ.1.65లక్షలు) పోలిస్తే వెండి ధర దాదాపు రూ.10వేల పైనే తగ్గింది. ఇక, అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 3546 డాలర్లు పలుకుతోంది. గత కొంతకాలంగా 4వేల డాలర్ల పైనే ఉన్న స్పాట్ గోల్డ్ ధర.. రోజుల వ్యవధిలోనే 500 డాలర్లకు పైగా పడిపోవడం గమనార్హం. ఇక, వెండి ధర ఔన్సు 41.84 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ డిసెంబరు డెలివరీ 10 గ్రాముల ధర రూ.1.22లక్షలు, కిలో వెండి రూ.1.49లక్షలుగా కొనసాగుతోంది. సాధారణంగా బంగారం లావాదేవీలు డాలర్ల రూపేణ జరుగుతాయి.

ఖేత్ బచావో అభియాన్ – రైతు భూముల పరిరక్షణపై అవగాహన

- **కల్పించిన ఏడీఏ నుతన్ కుమార్**

కోస్గి మండలం, నవంబర్,20(సమయం న్యూస్)



కోస్గి మండలం ముంగిమళ్ల గ్రామ పంచాయతీలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "ఖేత్ బచావో అభియాన్ - రైతు భూముల పరిరక్షణ" కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి కోస్గి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నూతన్ కుమార్, ముంగిమళ్ల గ్రామ సర్పంచ్ సుధాకర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్ కుమార్ (ఎఇఓ) కార్యక్రమంలో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏడీఏ నూతన్ కుమార్ మాట్లాడుతూ, వ్యవసాయ భూములు రైతులకు అత్యంత విలువైన ఆస్తి అని, భూముల పరిరక్షణతో పాటు భూసారాన్ని కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత అని తెలిపారు. అధిక రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గిస్తూ, నేల ఆరోగ్యాన్ని కాపాడే సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ పదార్థాల వినియోగం మరియు సుస్థిర వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. సర్పంచ్ సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలోని రైతులందరూ వ్యవసాయ భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రైతులకు ప్రధానంగా ఆరు అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది.

1. వ్యవసాయ భూముల పరిరక్షణ: సాగుభూముల నాణ్యతను కాపాడటం, భూమి క్షీణత మరియు భూమి వృథా కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం.
2. భూసార సంరక్షణ: పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు మరియు పంట అవశేషాలను ఉపయోగించడం ద్వారా నేలలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంచడం.
3. నేల ఆరోగ్య పరిరక్షణ: రైతులు తప్పనిసరిగా నేల పరీక్షలు చేయించుకొని, పరీక్ష ఫలితాల ఆధారంగా సమతుల్య ఎరువులను వినియోగించడం.
4. సహజ వనరుల సంరక్షణ: భూగర్భ జలాలు, వర్షపు నీరు మరియు ఇతర సహజ వనరులను పొదుపుగా వినియోగిస్తూ నీటి సంరక్షణ పద్ధతులను పాటించడం.
5. వ్యవసాయ భూముల సుస్థిర వినియోగం: పంట మార్పిడి విధానాన్ని అవలంబించడం, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను పాటించడం మరియు రసాయన ఎరువుల వినియోగాన్ని నేల అవసరాలకు అనుగుణంగా నిర్వహించడం.
6. భవిష్యత్ తరాలకు సాగుభూముల పరిరక్షణ: వ్యవసాయ భూముల సారాన్ని కాపాడుతూ, భూమి మరియు పర్యావరణాన్ని పరిరక్షించి రాబోయే తరాలకు సారవంతమైన భూములను అందించడం.

ఈ సందర్భంగా రైతులు తమ వ్యవసాయ భూములను కాపాడుకోవడం కేవలం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా సమాజం పట్ల ఉన్న బాధ్యత అని, ప్రతి రైతు ఈ అభియాన్‌లో భాగస్వామి కావాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ నూతన్ కుమార్, సర్పంచ్ సుధాకర్ గౌడ్,ఎఇఓ వినోద్ కుమార్, గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా..

- **ఇందిరమ్మ పథకానికి ప్రత్యేక శిబిరం!**
- **35వ డివిజన్‌లో నమోదు ప్రక్రియ ప్రారంభం**
- **18–59 ఏళ్ల మధ్య వయస్సున్న కుటుంబ సంపాదన సభ్యులకు అవకాశం**
- **ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి... శ్రీరాం రాజేష్**

వరంగల్, నవంబరు 20 (సమయం న్యూస్) :



పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జీడబ్ల్యూఎంసీ 35వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు శ్రీరాం రాజేష్ కోరారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా భరోసా లభిస్తుందని తెలిపారు.ఈ పథకంలో భాగంగా నవంబరు 19 నుంచి శివనగర్‌లోని ఏసీ రెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక నమోదు శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన కుటుంబ సంపాదన సభ్యులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు.నమోదు కోసం ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఫుడ్ సెక్యూరిటీ కార్డు (ఎఫ్ఎస్సీ) ఉన్నవారు వెంట తెచ్చుకోవాలని, కార్డు లేనివారు కూడా శిబిరానికి హాజరుకావచ్చని స్పష్టం చేశారు. బీమా కోసం దరఖాస్తు చేసుకునే వ్యక్తి స్వయంగా హాజరుకావాలని, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమై ఉండి ఓటీపీ స్వీకరించేందుకు వీలుగా ఫోన్ అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ప్రతి అర్హ కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని శిబిరంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని శ్రీరాం రాజేష్ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీరాం రాజేష్ పిలుపునిచ్చారు.

అభయాంజనేయుడి ఆలయానికి దారేది.?

- **అర్ధశతాబ్ద చరిత్ర కలిగిన ఆలయం**
- **అభయాంజనేయ స్వామి ఆలయానికి రహదారి పునరుద్ధరించాలి**
- **అధికారులు స్పందించకుంటే ఆందోళనలు తప్పవు... బీజేపీ జిల్లా అధ్యక్షుడు 'గంట రవికుమార్'**

వరంగల్, నవంబరు 20 (సమయం న్యూస్)



అభివృద్ధి పనుల పేరుతో ఓ సిటీలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయానికి ఉన్న దారిని మూసివేయడం సరికాదని, తక్షణమే భక్తుల రాకపోకలకు మార్గం కల్పించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ డిమాండ్ చేశారు. అర్ధశతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన పురాతన ఆలయానికి దారి లేకుండా చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట ప్రధాన రహదారి వైపు నుంచి ఆలయానికి ఉన్న దారిని అభివృద్ధి పనుల పేరుతో మూసివేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి మంగళ, గురు, శనివారాలతో పాటు శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, గురుపౌర్ణమి, ముక్కోటి ఏకాదశి, దసరా నవరాత్రుల సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.పురాతన ఆలయానికి దారి లేకుండా చేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ దేవాలయాల విషయంలోనే ప్రత్యేక నిబంధనలు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. ఈ ఆలయానికి సంబంధించిన సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి, భక్తులకు ఇబ్బందులు లేకుండా రహదారిని పునరుద్ధరించాలని కోరారు.అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే బీజేపీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని గంట రవికుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక ప్రతినిధులతో పాటు బీజేపీ నాయకులు భాకం హరిశంకర్, గడల కుమార్, ఎరుకల రఘునారెడ్డి, మడిపల్లి నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సిమెంట్, కాంక్రీట్ రంగంలో కార్బన్ న్యూట్రాలిటీపై ఎన్‌సీబీ సదస్సు

హైదరాబాద్, నవంబర్ 20:



సిమెంట్, కాంక్రీట్ రంగంలో కార్బన్ ఉద్గారాలను తగ్గించి నెట్‌జీరో లక్ష్యాల సాధనపై నేషనల్ కౌన్సిల్ ఫర్ సిమెంట్ అండ్ బిల్డింగ్ మెటీరియల్స్ (NCB) ఆధ్వర్యంలో రెండు రోజుల సదస్సు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సెంటెనరీ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభమైంది."సస్టైనబుల్ అండ్ నెట్ జీరో ఫ్యూచర్ వైపు" అనే థీమ్‌తో నవంబర్ 19-20 తేదీల్లో జరుగుతున్న ఈ సదస్సులో పరిశ్రమ నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు, కన్సల్టెంట్లు, టెక్నాలజీ సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నారు.మై హోమ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ (టెక్నికల్) వి.ఎస్. నారంగ్ ముఖ్య అతిథిగా సదస్సును ప్రారంభించారు. సీపబ్ల్యూడీ అదనపు డైరెక్టర్ జనరల్ దేబ్జ్యోతి రాయ్‌చౌధురి, జేఎన్‌డ బ్ల్యూ సిమెంట్ చీఫ్ సస్టైనబిలిటీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ మనోజ్ రుస్తగి గౌరవ అతిథులుగా హాజరయ్యారు.ఎన్‌సీబీ డైరెక్టర్ జనరల్ డా. ఎల్. పీ. సింగ్ మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలో ఈ స్థాయిలో ఎన్‌సీబీ నిర్వహిస్తున్న తొలి సదస్సు ఇదేనన్నారు. 2070 నాటికి నెట్‌జీరో లక్ష్యాన్ని సాధించేందుకు కార్బన్ క్యాప్చర్, వినియోగం, తక్కువ కార్బన్ సిమెంట్లు, ప్రత్యామ్నాయ ఇంధనాలు, యూహెచ్‌పీసీ వంటి సాంకేతిక తలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.దేశంలో సిమెంట్ పరిశ్రమ స్థాపిత సామర్థ్యం సుమారు 720 మిలియన్ టన్నులు కాగా, 1996లో టన్ను సిమెంట్‌కు 1.12 టన్నులుగా ఉన్న నిర్దిష్ట కార్బన్ ఉద్గారాలు 2026లో 0.560 టన్నులకు తగ్గాయని వి.ఎస్. నారంగ్ తెలిపారు. కార్బన్ క్యాప్చర్ టెక్నాలజీకి మరింత పరిశోధన, డెమో ప్రాజెక్టులు, క్లైమేట్ ఫైనాన్స్ అవసరమన్నారు. సదస్సుతో పాటు నిర్వహిస్తున్న టెక్నికల్ ఎగ్జిబిషన్‌లో సుమారు 35 ప్రముఖ సంస్థలు 50 స్టాళ్లలో తక్కువ కార్బన్ సిమెంట్, కాంక్రీట్ సాంకేతికతలు, పరికరాలు, ఉత్పత్తులు, పరిష్కారాలను ప్రదర్శిస్తున్నాయి.సదస్సులో తక్కువ కార్బన్ సిమెంట్లు, ఇంధన సామర్థ్యం, ప్రత్యామ్నాయ ఇంధనాలు, కార్బన్ క్యాప్చర్-యుటిలైజేషన్, మినరల్ కార్బొనేషన్, IS 456:2025 ముసాయిదా, 3డీ ప్రింటింగ్ కాంక్రీట్, డిజిటల్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత ఆటోమేషన్ తదితర అంశాలపై చర్చలు జరుగుతున్నాయి.

అప్పాయిపల్లిలో ఇందిరమ్మ భీమా,ఆసరా పెన్షన్ల ప్రొసీడింగ్ పత్రాలు అందించిన -మున్సిపల్ చైర్మన్

కొడంగల్ మండలం,నవంబర్,20(సమయం న్యూస్)



కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జన్మదిన సందర్భంగా గ్రామంలో ఇందిరమ్మ భీమ పథకాన్ని ఆసరా పెన్షన్ పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అగ్రికల్చర్ కాలేజ్ నిర్మించడానికి గ్రామంలోని 19 సర్వే నెంబర్ లో ప్రభుత్వానికి భూములు ఇచ్చిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేసిన మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి సర్పంచ్ బొడ్రా వెంకటయ్య కార్యక్రమంలో పాల్గొన్న ఉప సర్పంచ్ పకిరప్ప మండల ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్ గ్రామ అధ్యక్షుడు సంగప్ప వార్డ్ మెంబర్లు శ్యామ గోకుల్ సింగ్ దీపక్‌సింగ్ బందయ్య గౌడ్ శేఖర్ గౌడ్ రాంజీ నాయక్ ఎంపీడీవో ఉషశ్రీ సెక్రెటరీ శేఖర్ గ్రామ పెద్దలు దత్తు సింగ్ కిషన్ సింగ్ కాశయ్య గౌడ్ వెంకటయ్య భగవంతు పకీరప్ప పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంజయ్య 59వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

- **విద్యార్థులకు ప్రథమ ద్వితీయ తృతీయ స్థానంలో గెలుపొందిన**

సంగారెడ్డి జిల్లా సమయం న్యూస్

నవంబర్ 20 జిల్లా కేంద్ర గ్రంథాలయం సంగారెడ్డి యందు గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంజయ్య మరియు కార్యదర్శి శ్రీ యం.మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో గత వారం రోజులపాటు జరిగిన 59వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వారం రోజులపాటు జరిగిన వివిద పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నేడు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. విద్యార్థులకు ప్రథమ ద్వితీయ తృతీయ స్థానంలో గెలుపొందిన వారికి మరియు కన్సోలేషన్ బహుమతులను అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శ్రీ ఆంజయ్య గారు మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు హాజరయ్యారు ముగింపు రోజు కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది లలితా భాయి ,రాజ్ కుమార్, నవీన్, శోభ రాణి కృష్ణమూర్తి, భవిత శ్రీ , సరిత, మమత నాగరాజు తదితరులు పాల్గొనడం జరిగింది.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్

హైదరాబాద్, నవంబర్ 20



తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పరిశీలించారు. గచ్చిబౌలి, యూసుఫ్‌గూడ స్టేడియాలను సందర్శించి మౌలిక వసతులు, క్రీడాకారుల వసతి, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, రవాణా తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అన్ని ఏర్పాట్లను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసి, దేశం నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించాలని అదేశించారు.

హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

హైదరాబాద్, నవంబర్ 20:



ప్రభుత్వ, ప్రైవేటు వైద్యరంగాల సమన్వయంతో హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం గ్లోబల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. నిమ్స్, సనత్‌నగర్ టిమ్స్, అల్వాల్ టిమ్స్, కొత్తపేట టిమ్స్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం వార్డులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్యులకు ప్రైవేటు రంగ నిపుణులతో ఉచిత శిక్షణ అందించేందుకు ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు అత్యుత్తమ వైద్యం అందించడమే లక్ష్యమన్నారు.

విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

ఏటూరునాగారం, నవంబర్ 20:



మేడారం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఊరట్టం ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. eHMSలో విద్యార్థుల బ్యాంకు ఖాతాల నమోదు, అప్‌డేషన్‌తో పాటు ఆధార్ నమోదు వివరాలను పరిశీలించి, పెండింగ్ ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఊరట్టం పాఠశాలలో మైండ్‌స్పార్క్ కంప్యూటర్ తరగతులను పరిశీలించిన పీఓ, విద్యార్థుల చదవడం, రాయడం నైపుణ్యాలను పరీక్షించారు. విద్యా పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, డిజిటల్ అభ్యాసం, భాషా నైపుణ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు–2027

మేడ్చల్ నవంబర్20



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2027 కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు.జిల్లాలో అర్బన్‌లో సెలెక్ట్ అయిన 38 మంది పార్టిసిపెంట్స్‌కు పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. మొదటి, రెండో విడతల విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

విజేతలు:

జంగా లిఖిత రెడ్డి - బుర్గుల లాస్య గౌడ్

వై. మనీష్ రెడ్డి - పి. వైష్ణవి

వెల్పుల అనిల్ కుమార్ - ఎస్.కె. తరన్నుమ్ ముస్కాన్కార్యక్రమాన్ని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారులు నిర్వహించారు.

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న స్పీకర్, మంత్రి, ఎమ్మెల్యేలు

కొండగట్టు, నవంబర్ 20:

ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువును సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రజా ప్రభుత్వానికి అందించాలని కొండగట్టు ఆంజనేయస్వామిని ప్రార్థించినట్లు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు.శుక్రవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులతో కలిసి స్పీకర్ కొండగట్టు అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు.ప్రభుత్వం కరువు నివారణకు చేస్తున్న సూచనలను ప్రజలు తప్పకుండా పాటించాలని స్పీకర్ కోరారు. కొండగట్టు ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రత్యేక నిధులు సాధిస్తామని తెలిపారు.నిజరూప దర్శనం అదృష్టం: మంత్రి లక్ష్మణ్‌కుమార్కొండగట్టు ఆంజనేయస్వామి చందనోత్సవంలో పాల్గొని స్వామివారి నిజరూప దర్శనం చేసుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, ముఖ్యమంత్రి, స్పీకర్ సహకారంతో కొండగట్టు అభివృద్ధికి ప్రత్యేక నిధులు సాధిస్తామని తెలిపారు.



బోర్డు పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలి

- **కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్, నవంబర్ 20

పదో తరగతి బోర్డు పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని సోమవార్‌పేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పూర్తయిన సిలబస్ వివరాలను తెలుసుకున్నారు. పాఠాలను పునశ్చరణ చేసుకుంటూ, సందేహాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో గణిత లెక్కలు చేయించి, ప్రతిభ కనబరిచిన వారికి పెన్నులు అందజేశారు. పాఠశాల రిజిస్టర్లు, విద్యార్థులు-ఉపాధ్యాయుల హాజరు, యూడైస్ వివరాలను పరిశీలించారు. ఆధార్ లేని విద్యార్థులకు ఆధార్ కార్డులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో పూర్తిస్థాయి హాజరు ఉండేలా చూడాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎంఈవో పద్మ, అధికారులు పాల్గొన్నారు.



గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

ఆదిలాబాద్, నవంబర్ 20:

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలం యాపల్‌గూడలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి నూతనంగా నిర్మించిన గ్రంథాలయం, గ్రామ సమాఖ్య (వీఓ) భవనం, ఏసీ సామాజిక భవనాలను ప్రారంభించారు.గ్రామ సమాఖ్య భవనాన్ని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ సూచించారు. గ్రంథాలయం విద్యార్థులు, నిరుద్యోగ యువత, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయోగపడుతుందని తెలిపారు.ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ యాపల్‌గూడ ప్రజల చిరకాల ఆకాంక్షలు నెరవేరడం సంతోషకరమన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

- **ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా**
- **మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

చేగుంట నవంబర్ 20

మండలం కర్నాల్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రీమియం చెల్లించే ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల కుటుంబ సభ్యులకు పథకం వర్తిస్తుందని, పేద, ధనిక అనే తేడా లేకుండా అర్హులందరూ నమోదు చేసుకోవాలని సూచించారు. రైతు బీమా ఉన్నవారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు వివరాలతో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.కార్యక్రమంలో డీడబ్ల్యూఓ హేమ భార్గవి, ఎంపీడీవో చెన్నారెడ్డి, తహసీల్దార్ బాలలక్ష్మి, సర్పంచ్ పాల్గొన్నారు.



సిద్దిపేట సభపై హరీశ్‌రావు ఫైర్.. రేవంత్‌పై తీవ్ర విమర్శలు

- **తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్, నవంబర్ 20:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట సభలో అభివృద్ధి, ప్రజా సమస్యలను పక్కనపెట్టి బీఆర్ఎస్ నేతలను విమర్శించడానికే ఎక్కువ సమయం కేటాయించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. మూడేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సిద్దిపేట సభ నిర్వహించారని ఆరోపించారు. తెలంగాణకు జల ద్రోహంఏపీ జల దోపిడీకి కాంగ్రెస్ ప్రభుత్వం పరోక్షంగా సహకరిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. నాగార్జునసాగర్ కుడివైపు ఏపీ నిర్మిస్తున్న టన్నెల్‌పై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బనకచర్ల, సాగర్ టన్నెల్ అంశాల్లో బీఆర్ఎస్ ప్రశ్నించిన ప్రతిసారీ బ్యాక్‌డేట్ లేఖలు విడుదల చేసి తప్పించుకోవడం సరికాదన్నారు.299:512 వాటాలపై సవాల్

కృష్ణా జలాల్లో 299:512 వాటాల విషయంలో బీఆర్ఎస్ సంతకం చేసిందని నిరూపిస్తే తాను పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమా? అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. తెలంగాణ ఏర్పడిన వెంటనే నీటి హక్కుల కోసం కేసీఆర్ కేంద్రం, ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు స్థాయిలో పోరాటం చేశారని గుర్తుచేశారు.ప్రాజెక్టులపై శ్వేతపత్రం ఇవ్వాలి

దేవాదుల, పాలమూరు, కల్వకుర్తి, సీతారామ ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని ఎందుకు ఎత్తలేదో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. “కుప్పానికి నీళ్లు.. పాలమూరుకు కన్నీళ్లు ఎందుకు?” అని ప్రశ్నించారు.కరువు, రైతు సమస్యలపై నిలదీత

రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని హరీశ్‌రావు ఆరోపించారు. కరువు సాయం, ధాన్యం కొనుగోళ్లు, సన్నవడ్లకు బోనస్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి కరువు సాయం తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

“సిద్దిపేటలో నాతో పోటీకి రా”సిద్దిపేటలో పోటీ చేసి గెలిస్తే మంత్రి పదవి ఇస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ.. “వాళ్లో వీళ్లో కాదు.. నువ్వే సిద్దిపేటలో పోటీ చేయి. ప్రజల ముందే ఎవరి బలం ఎంతో తేల్చుకుందాం” అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణే బీఆర్ఎస్ లక్ష్యమని, ప్రభుత్వం ప్రజా సమస్యలపై స్పందించకపోతే ప్రజా, న్యాయ పోరాటాలకు సిద్ధమని హరీశ్‌రావు స్పష్టం చేశారు.సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ వద్ది రాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ చేయూత పెన్షన్లు

- **ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం..**
- **మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య..**

రాయపోల్ నవంబర్ 20.(సమయం న్యూస్)



కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు బడుగు బలహీన వర్గాలకు అందే విధంగా కృషి చేస్తుందని. ఇందులో భాగంగానే ప్రతి గ్రామంలో అర్హులందరికీ చేయూత పెన్షన్లు అందించడం జరుగుతుందని ఉమ్మడి దౌల్తాబాద్ రాయపోల్ మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గొల్ల పల్లి కనకయ్య అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో అర్హులకు చేయూత పెన్షన్లను గ్రామ సర్పంచ్ ఎక్కల శ్యామల మల్లేశం ఆధ్వర్యంలో పెన్షన్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో పేదలకు అన్ని విధాలా సహాయం చేస్తుందని. ఇది చూసి జీర్ణించుకోలేని ప్రతిక్ష పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో ప్రజలు రాష్ట్రంలో సుభిక్షంగా ఉన్నారని గుర్తు ఒక ప్రభుత్వాల హయంలో పేదల సంక్షేమం పేరు చెప్పుకొని పది సంవత్సరాలు పేదల రక్తం తాగారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో పార్టీలకు అతీతంగా అన్ని గ్రామాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజలు కూడా ఆలోచించి సంక్షేమ పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎల్లప్పుడూ ఆదరించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుర్ర నర్సింలు. అధికార ప్రతినిధి కృష్ణ గౌడ్. గ్రామ నాయకులు కృష్ణ. మన్నే బాలయ్య. పంగ రాజములు. పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

- **ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం**
- **18–59 ఏళ్ల కుటుంబ పెద్దలకు రూ.5 లక్షల కవరేజీ**
- **రేషన్ కార్డు ఉన్నా లేకపోయినా అర్హత.. నెల రోజుల పాటు ప్రత్యేక క్యాంపులు**

మేడ్చల్, నవంబర్ 20:



రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షల జీవిత బీమా అందిస్తామని చెప్పారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి పథకాన్ని ప్రారంభించారు.కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల కుటుంబ పెద్దలకు బీమా వర్తిస్తుందని తెలిపారు. ఇది యూనివర్సల్ కవరేజ్ పథకమని, రేషన్ కార్డు ఉన్నా లేకపోయినా అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. భార్య, పిల్లలు తదితరులను నామినీలుగా నమోదు చేసుకోవచ్చన్నారు.ఐదు నిమిషాల్లో ఆధార్ ఓటీపీ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. నమోదు పూర్తయిన వెంటనే మొబైల్‌కు రసీదు సందేశం వస్తుందని చెప్పారు. జిల్లాలోని వార్డులు, గ్రామాల్లో నెల రోజుల పాటు ప్రత్యేక నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ నిరంతర పోరాటం

- **సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం**

బొంరస్ పేట మండలం, నవంబర్ 20,(సమయం న్యూస్)



వికారాబాద్ జిల్లా బొంరస్ పేట మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ చౌదర్‌పల్లి, పీఎం శ్రీ బొంరస్ పేట పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న టీఎస్‌యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని,317 జీవో ద్వారా ఏర్పడిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేసి, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన చర్యలను నిలిపివేయాలని కోరారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు శివరాజ్, నడిమింటి మల్లేష్, మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్, ఉపాధ్యక్షుడు రమేష్, ఎఫ్‌డబ్ల్యూ మండల కన్వీనర్ నరేందర్ గౌడ్, జీహెచ్ఎం రవీందర్ గౌడ్, ప్రశాంత్, గంజా వెంకటయ్య తదితరులతో పాటు మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు

- **ప్రభుత్వ ఉద్యోగ సాధనకు గ్రంథాలయాలే వేదిక: మహమ్మద్ అలీ షబ్బీర్**
- **విద్యార్థుల భవిష్యత్తుకు గ్రంథాలయాలు కీలకం:**
- **కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

కామారెడ్డి, నవంబర్ 20:



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొని, వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. డిజిటల్ వినోదానికి దూరంగా ఉండి, సమయాన్ని చదువుకు కేటాయించాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో అదనపు మౌలిక వసతుల కల్పనకు రూ.12 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. 24 గంటల గ్రంథాలయ సేవలకు అనుగుణంగా మరిన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.విద్యార్థులు కష్టపడి చదివి గ్రూప్ 1, గ్రూప్ 2 వంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత ఉద్యోగాలు పొందాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, అదనపు కలెక్టర్ గిరి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనురాగాల బంధానికి ఆత్మీయ ఆశీస్సులు..

- **ధరణి–దిలీప్‌లను ఆశీర్వదించిన చాడ సురేష్ రెడ్డి, ఈగ మల్లేశం**

హన్మకొండ, నవంబర్ 20 (సమయం న్యూస్) :

వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య మనుమరాలు ధరణి, దిలీప్ వివాహ మహోత్సవం హన్మకొండలోని పెద్దమ్మగడ్డ ఏఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు హన్మకొండ మాజీ ఎంపీ చాడ సురేష్ రెడ్డి, కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం తన సతీమణి సంగీతతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆత్మీయంగా ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం నిండు నూరేళ్లు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దాంపత్య జీవితం పరస్పర ప్రేమాభిమానాలు, అనురాగాలతో సంతోషంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలో డాక్టర్ పోల నటరాజ్, అబ్బు ప్రకాశ్ రెడ్డి, కరిమిల్ల సంపత్ రావు, సిలువేరు కుమారస్వామి, అన్నారపు రవీందర్ రెడ్డి, సంపత్ యాదవ్, గుడికందుల సంపత్, సంతకాల రవీందర్, నాగరాజు, మురళీకృష్ణ, అచ్చ శ్రీకాంత్, దయాకర్ పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.



రక్షిత సంచలనం

ఒలింపిక్ చాంప్ చెన్ యుఫీపై గెలుపు

సాత్విక్ జోడీ, సేన్ ముందంజ

కౌలూన్ (హాంకాంగ్): భారత యువ షట్లర్ రక్షితశ్రీ రామ్‌రాజ్ హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలనం సృష్టించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో 19 ఏండ్ల రక్షిత 21-18, 24-22తో ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ అయిన చెన్ యుఫీపై గెలిచి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయం సాధించింది. తొలిరౌండ్‌లో బ్లిచ్‌ఫీల్డ్‌ను చిత్తుచేసిన ఈ కోయంబత్తూర్ అమ్మాయి.. క్వార్టర్స్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన చౌచువాంగ్‌తో తలపడనుంది. ఇక మెన్స్ సింగిల్స్‌లో ఇప్పటికే వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో చోటు దక్కించుకున్న లక్ష్యసేన్.. 21-11, 21-18తో రస్మస్ గెమ్కె (డెన్మార్క్)ను చిత్తుచేసి క్వార్టర్ ఫైనల్‌కు ప్రవేశించాడు. మరో మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్ 12-21, 21-18, 21-14తో యు టే బిన్ (సౌత్‌కొరియా)ను ఓడించాడు. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం 21-19, 21-16తో అజ్రియాన్-కియోంగ్ (మలేషియా) జోడీపై గెలిచి క్వార్టర్స్ చేరింది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ జంట 20-22, 13-21తో లారెన్ లామ్-అలిసన్ లీ (అమెరికా) చేతిలో ఓడి ప్రిక్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది.



ఏ క్రికెటర్‌పైనా గంభీర్‌కు కోపం లేదు

కోచ్ సంజయ్ భరద్వాజ్

న్యూఢిల్లీ, నవంబర్ 20 (సమయం న్యూస్): మహమ్మద్ సిరాజ్ ముస్లిం కావడం వల్లే న్యూజిల్యాండ్‌తో మొదటి టెస్టు మ్యాచ్‌లో అతడిని దూరం పెట్టారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ చేసిన వ్యాఖ్యలపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చిన్ననాటి కోచ్ సంజయ్ భరద్వాజ్ స్పందించారు. సిరాజ్‌ను పక్కన పెట్టడం వెనుక మతానికి సంబంధించి ఎలాంటి కోణం లేదని ఆయన అన్నారు. శుక్రవారం ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడారు. సిరాజ్ విషయంలో హిందూ ముస్లిం కోణం లేదన్నారు. జట్టు అవసరాలు, కాంబినేషన్‌ను దృష్టిలో ఉంచుకొని టీం సెలెక్షన్ ఉంటుందన్నారు. సిరాజ్‌కు గంభీర్ ఎప్పుడూ అండగా నిలిచాడని, ఏ ఆటగాడిపైనా అతనికి కోపం లేదన్నారు. బలమైన జట్టు నిర్మాణమే హెడ్ కోచ్ ప్రాధాన్యమని పేర్కొన్నారు. 'సిరాజ్ విషయంలో వస్తున్న వార్తలన్నీ నిరాధారం. జట్టులో ప్రతిఒక్కరూ ఇండియనే. వారంతా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు. సిరాజ్‌కు గంభీర్ ఎప్పుడూ సపోర్ట్‌గా ఉన్నాడు. జట్టు పరిస్థితి, ఆటగాళ్ల ప్రదర్శనల ఆధారంగా ఎంపిక ఉంటుంది' అని భరద్వాజ్ వ్యాఖ్యానించారు. అలాగే, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కూడా జట్టు యాజమాన్యం నిర్ణయాన్ని సమర్థించాడు. కాగా.. సిరాజ్ ముస్లిం అయినందువల్లే అతడిని పక్కన పెట్టారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ అంతకుముందు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న వరల్డ్ టస్ట్ చాంపియన్‌షిప్ సైకిల్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత ఆటగాడు సిరాజ్‌ను న్యూజిల్యాండ్‌తో మొదటి టెస్టుకు దూరం పెట్టడంపై జట్టు యాజమాన్యంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

శ్రీలంకపై పాకిస్థాన్ ఘన విజయం!



- రెండో టెస్టులో ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు
- రెండేళ్ల తర్వాత టెస్టు సిరీస్ కైవసం

రావల్పిండి/హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): రెండో టెస్ట్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 8 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలుపొందింది. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో ఎదురైన గందరగోళం, కొందరు ఆటగాళ్లను పర్యటన మధ్యలోనే తొలగించడం వంటి ఇబ్బందుల తర్వాత పాకిస్తాన్‌కు ఇది ఎంతో ప్రత్యేకమైన విజయం. ఈ గెలుపుతో పాకిస్తాన్ జట్టు రెండేళ్ల తర్వాత తొలి టెస్ట్ సిరీస్‌ను 1-0 తేడాతో సొంతం చేసుకుంది. అంతకుముందు పాకిస్తాన్ 2024లో ఇంగ్లాండ్‌పై టెస్ట్ సిరీస్ గెలిచింది. రావల్పిండిలో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగో రోజు ఉదయం 90 పరుగుల లక్ష్యాన్ని పాకిస్తాన్ కేవలం 13 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. అజాన్ అవైస్ 32 పరుగులతో, ఆల్‌రౌండర్ ఆమిర్ జమాల్ 22 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 34 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 98 పరుగులకు ఆలౌట్ కాగా, పాకిస్తాన్ 325 పరుగులు చేసి 227 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక 316 పరుగులు చేసి 89 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని మాత్రమే ఇవ్వగలిగింది.

ఘన విజయంతో మొదలు

మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత్ శుభారంభం



భోపాల్: మహిళల హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో నాలుగో టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగిన ఆతిథ్య భారత్ ఘన విజయంతో టోర్నీని ప్రారంభించింది. గురువారం జరిగి తొలి మ్యాచ్‌లో 4-1తో మలేషియాను చిత్తు చేసింది. తొలి క్వార్టర్‌లో ఇరుజట్లూ గోల్ కొట్టలేకపోయినా రెండో క్వార్టర్ నుంచి జోరందుకున్న భారత్ ఆ తర్వాత ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగింది. ఆతిథ్య జట్టు నుంచి ముంతాజ్ ఖాన్ (19వ నిమిషంలో), సలీమ టెటె (35), పూజా సాహు (39), లాల్‌రెమ్‌సియామి (49) గోల్స్ చేశారు. మలేషియా ప్లేయర్లలో నురామిరా జుల్కిఫ్లి (19) ఏకైక గోల్ చేసింది. ఈ టోర్నీలో తదుపరి మ్యాచ్‌ను భారత్.. శనివారం కొరియాతో ఆడనుంది.

నేపాల్‌ను చిత్తుచేసిన భారత్

- 306 పరుగులతో ఘన విజయం!
- 26 పరుగులకే నేపాల్ కుప్పకూలింది



దోహా, నవంబర్ 20 (సమయం న్యూస్): ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ పోటీల్లో భారత్-ఎ జట్టు అద్భుత విజయంతో శుభారంభం చేసింది. నేపాల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఏకంగా 306 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 333 పరుగుల లక్ష్య ఛేదనలో నేపాల్ కేవలం 26 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్ల ధాటికి ప్రత్యర్థి జట్టు 11.3 ఓవర్లలోనే చేతులెత్తేసింది. ప్రిన్స్ యాదవ్ ఐదు వికెట్లు, హర్షిత్ రాణా నాలుగు వికెట్లు పడగొట్టి నేపాల్ పతనాన్ని శాసించారు. షాబాజ్ అహ్మద్ ఒక వికెట్ సాధించాడు. నేపాల్ తరఫున పవన్ సరాఫ్, రషీద్ ఖాన్ చెరో ఆరు పరుగులతో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లుగా నిలిచారు. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఎ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 332 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును సారథి తిలక్ వర్మ, కుమార్ కుశాగ్ర ఆదుకున్నారు. తిలక్ వర్మ 113 బంతుల్లో ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 107 పరుగులు చేయగా, కుశాగ్ర 102 బంతుల్లో పది ఫోర్లు, ఐదు సిక్సర్లతో 117 పరుగులు సాధించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 206 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారు. చివర్లో సూర్యాంశ్ షెడ్గే కేవలం 14 బంతుల్లో నాలుగు సిక్సర్లతో అజేయంగా 36 పరుగులు చేసి భారత స్కోరును 332కు చేర్చాడు. నేపాల్ బౌలర్లలో సందీప్ లామిచానే, లలిత్ రాజ్‌బన్షీ చెరో మూడు వికెట్లు సాధించారు. అనంతరం భారత వేగవంతమైన బౌలర్లను ఎదుర్కోలేక నేపాల్ బ్యాటర్లు వరుసగా వెనుదిరిగారు. కేవలం 17 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన నేపాల్ చివరకు 26 పరుగులకే ఆలౌటైంది. బ్యాటింగ్‌లో తిలక్, కుశాగ్ర శతకాలు.. బౌలింగ్‌లో ప్రిన్స్, హర్షిత్ అద్భుత ప్రదర్శనతో భారత్ చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది.

ఆడకుండానే పాక్‌కు ఆసియా కప్

- నిరసనగా భారత్ బహిష్కరణ!
- వర్షంతో రద్దయిన అంధుల ఆసియా కప్ ఫైనల్



ఢాకా, నవంబర్ 20 (సమయం న్యూస్): మైదానంలో తలపడకుండానే భారత్ - పాకిస్థాన్ మధ్య అంధుల ఆసియా కప్ విజేత ఎవరో తేలిపోయింది. వర్షం కారణంగా ఫైనల్ మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దవడంతో పాకిస్థాన్‌ను విజేతగా ప్రకటించారు. ఈ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన భారత అంధుల క్రికెట్ జట్టు ట్రోఫీ ప్రదానోత్సవాన్ని బహిష్కరించింది. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో శుక్రవారం పురుషుల బ్లైండ్ ఆసియా కప్ ఫైనల్ జరగాల్సి ఉంది. అయితే ఎడతెరిపి లేని వర్షంతో టాస్ కూడా సాధ్యం కాలేదు. దీంతో లీగ్ దశలో మెరుగైన నెట్ రన్‌రేట్ ఆధారంగా పాకిస్థాన్‌ను విజేతగా ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని భారత క్రికెట్ సంఘం ఫర్ ది బ్లైండ్ (సీఏబీఐ) తీవ్రంగా వ్యతిరేకించింది. టోర్నీ నిబంధనల ప్రకారం భారత్, పాకిస్థాన్‌లను ఉమ్మడి విజేతలుగా ప్రకటించాల్సి ఉందని సీఏబీఐ వాదించింది. ఈ అంశంపై వరల్డ్ బ్లైండ్ క్రికెట్ కౌన్సిల్ సాంకేతిక కమిటీ తొలుత అంగీకరించినప్పటికీ.. ఆ తర్వాత నిర్ణయం మారిందని ఆరోపించింది. నిబంధనల్లో లేని విధంగా నెట్ రన్‌రేట్‌తో విజేతను నిర్ణయించడం అన్యాయమని పేర్కొంది. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు భవిష్యత్తులో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లు ఆడకూడదని భారత అంధుల జట్టు భావిస్తున్నట్లు సీఏబీఐ కార్యదర్శి శైలేంద్ర వెల్లడించారు. భారత జట్టు అధ్యక్షుడు మహంతేశ్ జీకే సైతం ఈ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మైదానంలో ఆడి గెలిస్తే పాక్ విజయాన్ని అంగీకరించేవాళ్లమని, ఇలా ఏకపక్షంగా విజేతగా ప్రకటించడాన్ని మాత్రం ఒప్పుకోబోమని స్పష్టం చేశారు.



తొలి సినిమా రిలీజ్ రోజే జాక్‌పాట్..

నాగచైతన్య సరసన ఛాన్స్ కొట్టేసిన యంగ్ బ్యూటీ సాత్విక వీరవల్లి!

హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): తొలి సినిమా ఫలితం తెలియకముందే వరుస అవకాశాలు దక్కించుకుంటూ యువ నటి సాత్విక వీరవల్లి తెలుగు చిత్ర పరిశ్రమలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కిన 'ఆకాశంలో ఒక తార' చిత్రంతో వెండితెరకు పరిచయమవుతున్న సాత్వికకు మరో భారీ అవకాశం దక్కింది. అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మించనున్న కొత్త చిత్రంలో ఆమెను కథానాయికగా ఎంపిక చేసినట్లు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ వెల్లడించారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసిన సాత్వికా వీరవల్లి సినిమాలపై ఆసక్తితో ఉద్యోగాన్ని వదిలి భారత్‌కు తిరిగివచ్చారు. 'ఆకాశంలో ఒక తార' చిత్రంతో నటిగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ చిత్ర ప్రచార కార్యక్రమంలో అల్లు అరవింద్ మాట్లాడుతూ సాత్విక నటనను ప్రత్యేకంగా ప్రశంసించారు. చిత్రీకరణ పూర్తయిన తర్వాత సన్నివేశాలను పరిశీలించినప్పుడు ఆమె నటన తనను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పారు. కొత్త నటే అయినప్పటికీ అనుభవం ఉన్న కథానాయికలా నటించడంతో తమ సంస్థ నిర్మించే తదుపరి చిత్రానికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. నాగచైతన్య సరసన సాత్విక నటించనున్న విషయాన్ని అల్లు అరవింద్ వెల్లడించడంతో దుల్కర్ సల్మాన్ కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. తొలి చిత్రం విడుదలవుతున్న సమయంలోనే మరో ప్రముఖ కథానాయకుడితో నటించే అవకాశం దక్కడం విశేషంగా మారింది. ఈ చిత్ర దర్శకుడు, చిత్రీకరణ ప్రారంభానికి సంబంధించిన వివరాలు ఇంకా వెల్లడికాలేదు. మరోవైపు సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించనున్న 'ఆర్సీ 17' చిత్రంలోనూ సాత్వికను కథానాయికగా పరిశీలిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. తొలి చిత్రంతోనే ప్రముఖ దర్శకనిర్మాతల దృష్టిని ఆకర్షించిన సాత్విక భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు అందుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తమ నటుడు రణ్‌వీర్.. 'ధురంధర్'కు అవార్డుల మోత



- దాదాసాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ చలనచిత్రోత్సవ పురస్కారాల ప్రకటన
- ఉత్తమ చిత్రం, దర్శకుడు సహా పలు విభాగాల్లో 'ధురంధర్' హవా
- 'సయారా' చిత్రానికి ఉత్తమ నటిగా అనీత్ పడ్డా
- అంతర్జాతీయ కళాకారిణిగా టేలర్ స్విఫ్ట్‌కు గౌరవం
- కమల్‌హాసన్, ఇళయరాజాలకు విశిష్ట పురస్కారాలు



ముంబై నవంబర్ 20 (సమయం న్యూస్): దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 అవార్డులను శుక్రవారం ప్రకటించారు. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' అవార్డుల మోత మోగించింది. ఉత్తమ నటుడి అవార్డు రణవీర్ సింగ్‌ను వరించింది. ఇక 'సయారా'లో నటనకు గానూ ఉత్తమ నటి అవార్డును అనీత్ పడ్డా సొంతం చేసుకుంది. ఉత్తమ చిత్రంగా 'ధురంధర్' నిలిచింది. ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ప్రముఖ గాయని టేలర్ స్విఫ్ట్ ఎంపికయ్యారు. సంగీత ప్రతిభ, పాటల రచనా నైపుణ్యం, అంతర్జాతీయ సాంస్కృతిక ప్రభావం, లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి ఆమె అందించిన సేవలను గుర్తిస్తూ టేలర్ స్విఫ్ట్‌కు ఈ పురస్కారాన్ని కమిటీ ప్రకటించింది. దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ద్వారా భారతీయ సినిమా, వినోద రంగానికి చెందిన ప్రతిభావంతులను గుర్తించి అవార్డుతో సత్కరిస్తున్నారు. భారతీయ సినిమా పితామహుడిగా ప్రసిద్ధి చెందిన దాదాసాహెబ్ ఫాల్కే పేరు మీద ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. సినీ నిర్మాణం, కళలు, వినోద రంగాలకు సంబంధించిన వివిధ విభాగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ వేదికపై పురస్కారాలను అందిస్తున్నారు.

ఫాల్కే అవార్డు విజేతలు వీళ్లే

ఉత్తమ చిత్రం: ధురంధర్
ఉత్తమ నటుడు: రణ్‌వీర్ సింగ్ (ధురంధర్)
ఉత్తమ నటి: అనీత్ పడ్డా (సయారా)
ఉత్తమ దర్శకుడు: ఆదిత్య ధర్ (ధురంధర్)
ఉత్తమ సహాయ నటుడు: వినీత్ కుమార్ సింగ్ (ఛావా)
ఉత్తమ ప్రతినాయకుడు: అక్షయ్ ఖన్నా (ధురంధర్)
హాస్య ప్రధాన పాత్రలో ఉత్తమ నటుడు: రితేశ్ దేశ్‌ముఖ్ (హౌస్‌ఫుల్5)
ఉత్తమ సంగీత దర్శకుడు: శాశ్వత్ సచ్‌దేవ్ (ధురంధర్)
క్రిటిక్స్ బెస్ట్ ఫిల్మ్: కాంతార: చాప్టర్1
క్రిటిక్స్ బెస్ట్ యాక్టర్: రిషబ్‌శెట్టి (కాంతార: చాప్టర్1)
క్రిటిక్స్ బెస్ట్ యాక్టర్: యామి గౌతమ్‌ధర్ (హక్)
ప్రొడ్యూసర్ ఆఫ్ ది ఇయర్: ఆదిత్యధర్, జ్యోతి దేశ్‌పాండే, లోకేశ్‌ధర్: ధురంధర్
ఉత్తమ కొరియోగ్రఫీ: శాండీ మాస్టర్ (కూలీ-మోనికా బెలూసీ)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్: అరవింద్ ఎస్.కశ్యప్ (కాంతార: చాప్టర్1)
ఉత్తమ్ స్క్రీన్‌ప్లే అండ్ డైలాగ్: రీష్ నాథ్ (హక్)
ఉత్తమ గేయ రచయిత: ఇర్షద్ కమిల్ (సయారా)
ఉత్తమ నేపథ్య గాయకుడు: ఫహీమ్ అబ్దుల్లా (సయారా)
ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్: కరణ్ ఆజ్లా
సాంగ్ ఆఫ్ ది ఇయర్: సయారా
కమెడియన్ ఆఫ్ ది ఇయర్: సామే రైనా
అవుట్‌స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ మ్యూజిక్ ఇండస్ట్రీ: ఇళయరాజా
అవుట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ ఫిల్మ్ ఇండస్ట్రీ: కమల్‌హాసన్

ఉత్తమ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్: అవతార్: ఫైర్ అండ్ యాష్
ఉత్తమ దర్శకుడు (ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్): వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
ఉత్తమ నటుడు (ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్): మైకేల్ బి.జోర్డాన్ (సిన్నర్స్)
ఉత్తమ నటి (ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్): జెస్సీ బక్లే (హ్యామ్‌నెట్)
అవుట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ గ్లోబల్ సినిమా: జేమ్స్ కామెరూన్
ఉత్తమ లఘు చిత్రం: మాధురి - ఎండ్ ఈజ్ బిగినింగ్ (సయీద్ షాహిద్ ఖాన్)
ఉత్తమ లఘు చిత్రం (ద్వితీయ) - జహాన్ - ది లాస్ట్ గిఫ్ట్ (రాహుల్ శెట్టి)
ఉత్తమ షార్ట్ ఫిల్మ్ (సెకండ్ రన్నరప్) - ఇన్ హాఫ్ (జోర్జే మోరిస్)
ఉత్తమ షార్ట్ ఫిల్మ్ (థర్డ్ రన్నరప్) - టీ కొట్టు 83 (సాయి హరిణి వసంత్)

ఓటీటీ విజేతలు వీళ్లే

ఉత్తమ వెబ్‌సిరీస్: ది బ్యాలిలి డ్స్‌ఆఫ్ బాలీవుడ్
ఉత్తమ దర్శకుడు: ఆర్యన్‌ఖాన్ (ది బ్యాలిలి డ్స్‌ఆఫ్ బాలీవుడ్)
ఉత్తమ నటుడు: జైదీప్ అహ్లావత్ (పాతాళ్ లోక్: సీజన్2)
ఉత్తమ నటి: షెఫాలీ షా (దిల్లీ క్రైమ్ సీజన్3)
ఉత్తమ సహాయ నటుడు: వినయ్ పాఠక్ (గ్రామ్ చికిత్సాలయ)
ఉత్తమ ప్రతినాయకురాలు: హ్యుమా ఖురేషి (దిల్లీ క్రైమ్ సీజన్3)
టెలివిజన్ సిరీస్ ఆఫ్ ది ఇయర్: తారక్ మెహతా కా ఉల్టా ఛష్మా
ఉత్తమ నటుడు (టెలివిజన్ సిరీస్): అమర్ ఉపాధ్యాయ్ (క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ 2)
ఉత్తమ నటి (టెలివిజన్ సిరీస్): స్మృతి ఇరానీ (క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ 2)







వెంకటేష్- కల్యాణ్ రామ్ 'జనవరి 12 విడుదల'

'దివ్వికి దివ్వికి' సాంగ్ ప్రోమోతో ప్రమోషన్లు షురూ!



హైదరాబాద్, నవంబర్ 20 (సమయం న్యూస్): విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'జనవరి 12 విడుదల'. సంక్రాంతి కానుకగా 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్లను చిత్రబృందం ఘనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా సినిమాలోని తొలి పాట 'దివ్వికి దివ్వికి' సాంగ్ ప్రోమోను తాజాగా విడుదల చేశారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా, ఈ పాటతో మ్యూజికల్ మ్యాజిక్ ఖాయమని చిత్రబృందం పోస్ట్‌లలో ఆసక్తిని రేకెత్తించింది. వెంకటేష్, కల్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న తొలి సినిమా కావడంతో 'జనవరి 12 విడుదల'పై ఆరంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్, జీ స్టూడియోస్ సౌత్, జీ మ్యూజిక్ సౌత్ వంటి ప్రముఖ సంస్థలు ఈ ప్రాజెక్ట్‌తో అనుసంధానమై ఉన్నాయి.



PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

పేద విద్యార్థుల చదువుకు పెద్దపీట..

- **యువత భవిష్యత్తుకు గ్రంథాలయ కానుక!**
- **ఎస్ఆర్ఆర్ తోటలో నూతన భవనంలో త్వరలో గ్రంథాలయం ప్రారంభం.. ఎమ్మెల్యే కొండా సురేఖ**
- **మాజీ కార్పొరేటర్ పల్లం పద్మా రవి చొరవతో యువత, నిరుద్యోగులకు అక్షర కానుక**

వరంగల్, నవంబర్ 20 (సమయం న్యూస్) :



నగరంలోని ఎస్ఆర్ఆర్ తోటలో నూతనంగా నిర్మించిన భవనంలో త్వరలో గ్రంథాలయాన్ని ప్రారంభించనున్నట్లు మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ హామీ ఇచ్చారు. స్థానిక యువత, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.ఎస్ఆర్ఆర్ తోటలో నిర్మించిన నూతన భవనాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయంగా ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ పల్లం పద్మా రవి ఎమ్మెల్యే కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఆవశ్యకతను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతంలో విద్యార్థులు, యువతకు చదువుకునేందుకు అనువైన వాతావరణంతో పాటు పుస్తకాలు, విజ్ఞాన సంబంధిత సమాచారాన్ని అందుబాటులో ఉంచితే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. వినతిపై సానుకూలంగా స్పందించిన కొండా సురేఖ.. నూతన భవనంలో త్వరలోనే గ్రంథాలయాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రంథాలయాలు విజ్ఞాన వికాసానికి కేంద్రాలుగా నిలుస్తాయని, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు యువత భవిష్యత్తుకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ప్రశాంతమైన అధ్యయన వాతావరణం కల్పించడం ద్వారా వారి లక్ష్య సాధనకు తోడ్పాటు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగమల్ల సందీప్, బొల్లం మధు, కొండరాజు, సామల సత్యం, కొండా సుధాకర్, శ్యామ్, తాళ్ల పల్లి శివ, ఆమంచ సతీష్, బుదారపు సాంబయ్య, నీలం వినీత్, దేవనూరు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు, షేర్లు, ఫార్వర్డ్‌లు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**
- **సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత, రెచ్చగొట్టే పోస్టులు చేస్తే కఠిన చర్యలు**

నారాయణపేట, నవంబర్,20(సమయం న్యూస్)



నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల వేదికగా విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు,దుష్ప్రచారాలు, కుల, మత, ప్రాంతీయ విభేదాలను ప్రేరేపించే పోస్టులు, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధమైన ఫోటోలు, వీడియోలు షేర్ చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ... Facebook, X (Twitter), Instagram, WhatsApp తదితర సామాజిక మాధ్యమాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే, ఒక వర్గాన్ని కించపరిచే విధమైన పోస్టులు చేయడం, ఇతరులు చేసిన పోస్టులను ఎలాంటి నిర్ధారణ లేకుండా షేర్ చేయడం లేదా ఫార్వర్డ్ చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వివాదాస్పద వీడియోలు, ఫోటోలు, సందేశాలను పరిశీలించకుండా ఇతరులకు పంపవద్దని సూచించారు. అభ్యంతరకరమైన పోస్టులను ఫార్వర్డ్ చేసే వారితో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సహకరించే గ్రూప్ అడ్మిన్ల బాధ్యతను కూడా పరిశీలించి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.సామాజిక మాధ్యమాలను ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని పంచుకోవడానికి, మంచి కార్యక్రమాల ప్రచారానికి మాత్రమే వినియోగించాలని, వ్యక్తిగత విద్వేషాలు, రాజకీయ, కుల, మతపరమైన విభేదాలను రెచ్చగొట్టడానికి వేదికలుగా మార్చుకోవద్దని సూచించారు.సోషల్ మీడియా వేదికలపై నిరంతరం నిఘా ఉంచేందుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిధిలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.కావున ప్రజలందరూ సామాజిక మాధ్యమాల్లో ఏదైనా పోస్టు చేసే ముందు లేదా ఇతరులకు ఫార్వర్డ్ చేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని,శాంతిభద్రతలకు భంగం కలిగించే సమాచారాన్ని ప్రచారం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు.

ఆన్‌లైన్ పెట్టుబడి మోసానికి తొమ్మిది మంది అరెస్ట్

- **రూ.74 లక్షలు కొల్లగొట్టిన సైబర్ ముఠా గుట్టురట్టు.. మరో ఇద్దరు ప్రధాన నిందితులు పరారీ**

మల్కాజిగిరి, సమయం:



ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో అమాయకులను బురిడీ కొట్టించి రూ.74 లక్షలు కాజేసిన సైబర్ మోసగాళ్ల ముఠా గుట్టును మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేయగా, మరో ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి తొమ్మిది మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఐఆర్ నం.605/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.వాట్సాప్ గ్రూపుల ద్వారా వలపోలీసుల వివరాల ప్రకారం.. 2026 జూన్ 8న బాధితుడిని అతని అనుమతి లేకుండానే 'D 108 AXIS ALPHA INVESTORS in AXIDMA' అనే వాట్సాప్ గ్రూపులో చేర్చారు. అనంతరం 'D104 AXIS SECURITIES Customer Service' పేరుతో మరో గ్రూపు ద్వారా సంప్రదింపులు కొనసాగించారు. అనన్య మెహ్రో, ప్రణవ్ హరిదాసన్, అదితి అయ్యర్ తదితర పేర్లతో పరిచయమైన వ్యక్తులు స్టాక్ మార్కెట్ చిట్కాలు, షేర్ల కొనుగోలు, అమ్మకాల సూచనలు, బ్లాక్ ట్రేడింగ్ పేరుతో పెట్టుబడి పథకాలను ప్రచారం చేశారు.పెట్టుబడులపై 5 నుంచి 50 శాతం వరకు లాభాలు వస్తాయని నమ్మించారు. తాము భారీ లాభాలు పొందుతున్నామని, క్రమం తప్పకుండా నగదు ఉపసంహరించుకుంటున్నామని చెప్పి బాధితుడికి ఆశ కల్పించారు. అనంతరం AXIS SECURITIES AXIDMA పేరుతో ఉన్న అప్లికేషన్‌లో నమోదు చేసుకుని పెట్టుబడులు పెట్టాలని సూచించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు విడతలవారీగా రూ.74 లక్షలు బదిలీ చేసి మోసపోయాడు.కమీషన్ ఆశ చూపి బ్యాంకు ఖాతాల సేకరణ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు బ్యాంకు స్టేట్‌మెంట్లు, కేవైసీ, ఖాతా ప్రారంభ దరఖాస్తుల వివరాలను పరిశీలించారు. బాధితుడి నుంచి బదిలీ అయిన రూ.74 లక్షలు ఆర్‌బీఎల్ బ్యాంకు ఖాతా ద్వారా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఖాతాదారుడు సలీమ్ సహకారంతో నగదు లావాదేవీలకు సంబంధించిన వివరాలను సేకరించి ముఠా కార్యకలాపాలను గుర్తించారు. మోసపూరితంగా సంపాదించిన డబ్బును స్వీకరించి ఇతర ఖాతాలకు బదిలీ చేసేందుకు నిందితులు కమీషన్ ప్రాతిపదికన బ్యాంకు ఖాతాలను సమకూర్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఖాతాదారులకు 20 శాతం, ఖాతాల మధ్యవర్తులకు 5 శాతం కమీషన్ ఇస్తామని ఆశ చూపినట్లు పోలీసులు గుర్తించారు. బ్యాంకు ఖాతాల వివరాలు, లాగిన్ ఆధారాలను సేకరించి ప్రధాన మోసగాళ్లకు అందించినట్లు తేలింది.ప్రధాన నిందితులు పరారీలో..ఈ మోసానికి ప్రధాన సూత్రధారులుగా మహారాష్ట్రకు చెందిన రాహుల్, గౌరవ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారి ఆదేశాల మేరకు అరెస్టయిన తొమ్మిది మంది వ్యవహరించినట్లు వెల్లడైంది. హైదరాబాద్‌కు చెందిన మొహమ్మద్ అజర్ జానీ అమాయకులు, కమీషన్ ఆశించే వ్యక్తుల నుంచి బ్యాంకు ఖాతాలను సేకరించి మోసపు సొమ్ము లావాదేవీలకు సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.అరెస్టయిన తొమ్మిది మందిని న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. మోసపోయిన నగదు ఎక్కడెక్కడికి బదిలీ అయిందనే అంశంతో పాటు మరికొందరి ప్రమేయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అరెస్టయిన నిందితులు వీరే..
మొహమ్మద్ అజర్ జానీ - హైదరాబాద్.
పర్వేజ్ ఖాన్ - మహారాష్ట్ర.
ముబీన్ ఖాన్ - మహారాష్ట్ర.
మాచర్ల కిరణ్ - ఖమ్మం.
కారం ప్రవీణ్ కుమార్ - ఖమ్మం.
దుద్దుకూరు వెంకట శేషు వరప్రసాద్ - రంగారెడ్డి.
హెడా శ్రీకాంత్ - హైదరాబాద్.
ముదస్సర్ నజర్ - టోలిచౌకి, హైదరాబాద్.
సిద్దవటం శ్రీనివాస్ - సికింద్రాబాద్.
పరారీలో ఉన్న ప్రధాన నిందితులు: రాహుల్, గౌరవ్ (మహారాష్ట్ర).

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
అపరిచితులు వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంపే పెట్టుబడి ఆఫర్లను నమ్మవద్దని పోలీసులు సూచించారు. అసాధారణంగా అధిక లాభాలు వస్తాయని చెప్పే వెబ్‌సైట్లు, ట్రేడింగ్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, పిన్‌లు, ఆధార్, పాన్ వివరాలను ఎవరికీ వెల్లడించవద్దన్నారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

పోలీసు అధికారుల పర్యవేక్షణలో దర్యాప్తు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, సైబర్ క్రైమ్స్ డీసీపీ ఎస్. వి. నాగలక్ష్మి, ఏసీపీ కె. బాలకృష్ణ రెడ్డి మార్గదర్శకత్వంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె. నాగాచారి, ఆయన బృందం ఈ కేసును ఛేదించింది. మిగిలిన నిందితులను పట్టుకునేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

కళాకారుల వేదికలో 'కుడా'కార్యాలయమా.?

- **కాళోజీ కళాక్షేత్రం నుంచి కార్యాలయాన్ని వెంటనే తరలించాలి.. బీఆర్ఎస్ నేతల డిమాండ్**
- **ప్రజాధనంతో నిర్మించిన భవనాన్ని వాణిజ్య అవసరాలకు వాడొద్దు.. మర్రి యాదవ రెడ్డి, జోరిక రమేష్**

హనుమకొండ, నవంబర్ 20 (సమయం న్యూస్)



కవులు, కళాకారులు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రంలోకి కుడా కార్యాలయాన్ని తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి అన్నారు. వెంటనే కార్యాలయాన్ని పాత భవనంలోకి తరలించి, కళాక్షేత్రాన్ని పూర్తిస్థాయిలో కళాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. శుక్రవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళోజీ ఫౌండేషన్ విజ్ఞప్తి మేరకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించి, సుమారు రూ.100 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో కళాక్షేత్ర నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ హయాంలో దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కళాకారుల కోసం మినీ హాల్, సమావేశ మందిరాలు కేటాయించాలని పలుమార్లు కోరినా స్పందన లేదన్నారు. రూ.5 కోట్లతో నిర్మించిన సకల సౌకర్యాలున్న పాత కుడా కార్యాలయాన్ని ఖాళీ చేసి కళాక్షేత్రంలోకి వెళ్లాల్సిన అవసరమేమిటని ప్రశ్నించారు.

మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ మాట్లాడుతూ 2014 నవంబర్ 9న కాళోజీ జయంతి సందర్భంగా కేసీఆర్ కళాక్షేత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 1,500 మందికి పైగా కూర్చునే సామర్థ్యంతో నిర్మించిన ఇండోర్ ఆడిటోరియం నేటికీ కళాకారులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడం విచారకరమన్నారు. కాళోజీ జయంతి, వర్ధంతి కార్యక్రమాల నిర్వహణకు కూడా సరైన ఏర్పాట్లు చేయడం లేదని, సామాన్య కళాకారులకు అందుబాటు ధరల్లో వేదిక కల్పించాల్సింది పోయి భారీ అద్దెలు నిర్ణయించడం సరికాదన్నారు.ప్రభుత్వ కార్యాలయాలను తరచూ ఒకచోటు నుంచి మరోచోటుకు మారుస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కుడా భూములను ప్రైవేటు వ్యక్తులకు, తమకు అనుకూలమైన వారికి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. కుడా కార్యాలయాన్ని వెంటనే పాత భవనంలోకి తరలించి, కాళోజీ కళాక్షేత్రాన్ని కవులు, కళాకారులు, సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయాలని ఇరువురు నేతలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కళాకారులు, ప్రజాసంఘాలు, ఇతర రాజకీయ పార్టీలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆశ్రమ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

- **ఐటీడీఏ పీఓకు TPTF వినతి**

ఆదిలాబాద్, నవంబర్ 20:



గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని TPTF ఆదిలాబాద్ జిల్లా శాఖ ప్రతినిధులు ఐటీడీఏ పీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు వేడి నీటి సౌకర్యం, కంప్యూటర్ బోధకుల నియామకం, శిథిల భవనాల మరమ్మతులు, ఆన్‌లైన్ పనిభారం తగ్గించేందుకు కంప్యూటర్ సహాయకుల నియామకం చేపట్టాలని కోరారు. అలాగే హెచ్‌డబ్ల్యూఓ పోస్టులను భర్తీ చేయాలని, CRTలకు కనీస వేతనం కల్పించాలని, ఉపాధ్యాయ ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని పీఓ హామీ ఇచ్చారు.

బాలల హక్కుల పరిరక్షణతోనే బంగారు భవిష్యత్తు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 20:



బాలలకు సురక్షిత బాల్యం, నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, సమాన అవకాశాలు కల్పించినప్పుడే అభివృద్ధి చెందిన సమాజం సాధ్యమవుతుందని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కే.ఎం. తార అన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా చుంచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, హింస, అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి హరి కుమారి, మహిళా సాధికారత సిబ్బంది సౌజన్య, షీటీం ఎస్ఐ రమాదేవి, డిసిపియు, సిబ్బంది పాల్గొన్నారు.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా

ఖమ్మం, నవంబర్ 20:



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. సుడా చైర్మన్ పూవాళ్ల దుర్గా ప్రసాద్, డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారం రోజుల పాటు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డాన్స్, యోగా తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఖాదర్ బాబా మాట్లాడుతూ, గ్రంథాలయ అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. నూతన గ్రంథాలయ భవనంలో వచ్చే ఏడాది 60వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లపై అధికారుల సమీక్ష

మేడ్చల్–మల్కాజిగిరి, నవంబర్ 20:

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.టార్పాలిన్లు అందుబాటులో ఉంచి, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న 48 గంటల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



రవాణా కార్మికుల సమస్యలపై కేంద్ర మంత్రుల సానుకూల స్పందన

న్యూఢిల్లీ, నవంబర్ 20



రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా, సామాజిక భద్రత కల్పనకు కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని BMS తెలిపింది. రాంలీలా మైదాన్‌లో నవంబర్ 18, 19 తేదీల్లో నిర్వహించిన మహా ధర్నాలో దేశవ్యాప్తంగా వేలాది మంది రవాణా కార్మికులు పాల్గొన్నారు.BMS ప్రతినిధి బృందం కేంద్ర మంత్రులు మన్సుఖ్ మాండవీయ, నితిన్ గడ్కరీలను కలిసి కార్మికుల సమస్యలను వివరించింది. ప్లేవేట్ రవాణా కార్మికులకు సామాజిక భద్రత, ప్రమాద బీమా, మహిళా ఉద్యోగులకు మెరుగైన సౌకర్యాలు, ఆటో కార్మికులకు రుణ సదుపాయాలపై మంత్రులు సానుకూల హామీలు ఇచ్చారు. ఈ సమావేశంలో BPTMM జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్ పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి

- **జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క**

నిజామాబాద్, నవంబర్ 20

నిజామాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఆర్మూర్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన 3,150 చేయూత పెన్షన్‌ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతామని తెలిపారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్మూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, కలెక్టర్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ బీమా దరఖాస్తుల్లో వివరాలు పక్కాగా నమోదు చేయాలి

- **ఇందిరమ్మ బీమా దరఖాస్తుల్లో వివరాలు పక్కాగా నమోదు చేయాలి**
- **ప్రత్యేక శిబిరాల్లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలన**

వేములవాడ/సిరిసిల్ల, నవంబర్ 20

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల్లో వివరాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ఆమె శుక్రవారం పరిశీలించారు.చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, సిరిసిల్ల 23వ వార్డులోని శిబిరాల్లో హెల్‌ప్‌డెస్క్‌లు, దరఖాస్తుల నమోదు, ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. బీమా దరఖాస్తుదారులు రేషన్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు అందించాలని, బీమా మరియు నామినీ వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక శిబిరాలు డిసెంబర్ 19 వరకు కొనసాగుతాయని తెలిపారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన కౌన్సిలర్

- **వాణిశ్రీ మధుసూదన్ యాదవ్**

కొడంగల్ మున్సిపల్, నవంబర్,20(సమయం న్యూస్)

కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ ముదిరాజ్ కమిటీ భవన్ లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించిన కొడంగల్ మున్సిపల్ రెండో వార్డ్ కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వరకే ఈ పథకాన్ని పరిమితం చేయడాన్ని కౌన్సిలర్ తప్పుపట్టారు వయసు పరిమితం లేకుండా రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వయసుకు సంబంధం లేకుండా వర్తించేలా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆర్ మధుసూదన్ యాదవ్ బండి గోపాల్ బాపనగిరి మోహన్ సెల్కం పేట మోహన్ బండి గోపాల్ రేలపేట రాఘవేందర్ కంసాన్పల్లి శివ దుద్యాల శ్రీనుబాకారం బాలెద్ది అంజమ్మ రేలపేట శృతి కవిత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



ఎల్లారెడ్డిపేట డిగ్రీ కాలేజీకి కవిత ఆర్థిక సాయం

సిరిసిల్ల, నవంబర్ 20

ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గుర్తింపు కొనసాగేందుకు టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న యూనివర్సిటీ గుర్తింపు ఫీజు రూ.1,30,800 చెల్లించాల్సి ఉండగా, గుర్తింపు రద్దయ్యే పరిస్థితి ఏర్పడింది.ఈ విషయాన్ని సిరిసిల్ల టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మజీద్ కవిత దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఆమె బకాయి మొత్తాన్ని చెల్లించేందుకు అంగీకరించారు. టీఆర్ఎస్ పాంచజన్య సంకల్పంలోని ప్రధాన అంశాల్లో ఉచిత విద్య ఒకటని, ప్రభుత్వ విద్యా సంస్థలను కాపాడేందుకు తమ వంతు సహాయం అందిస్తామని కవిత పేర్కొన్నట్లు మజీద్ తెలిపారు. కాలేజీ గుర్తింపు రద్దు కాకుండా ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చిన కవితకు విద్యార్థులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు అల్లె శంకర్, కదిరె రేణుక, మౌనిక, జావిద్, కదిరె భాస్కర్, శ్రీహరి, సాయి ప్రేమ్, సత్యం రెడ్డి, రాజేష్, హాజీ బాబా తదితరులు పాల్గొన్నారు.



అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

- **రూ.6,100 జరిమానా.. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం**

మల్కాజిగిరి, సమయం:

అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్‌లోని 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు నిచ్చింది. నిందితుడికి రూ.6,100 జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం అందించాలని ఆదేశించింది.సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో 2019లో నమోదైన క్రైమ్ నంబర్ 517/2019 కేసులో పైడిపోగు రాజేష్ (27) నిందితుడిగా ఉన్నాడు. ఖర్మన్‌ఘాట్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉండే రాజేష్ ఇంట్లో బాధితురాలి కుటుంబం అద్దెకు ఉండేది. సుమారు ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చిన ఆ కుటుంబం అక్కడే నివసిస్తోంది.2019 జూలై 28న తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో బాధితురాలు మరుగుదొడ్డికి వెళ్తుండగా ఇంటి యజమాని రాజేష్ బలవంతంగా తన గదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయాన్ని బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పగా, వారు రాజేష్‌ను నిలదీశారు. మొదట పెళ్లి చేసుకుంటానని నమ్మించిన నిందితుడు ఆ తర్వాత మాట తప్పి నిరాకరించాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో



భాగంగా ఘటనా స్థలాన్ని పరిశీలించి, సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆధారాలు సేకరించారు. న్యాయస్థానం ద్వారా బాధితురాలి వాంగ్మూలాన్ని సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద నమోదు చేయించారు. నిందితుడిని 2019 జూలై 31న అరెస్టు చేసి, దర్యాప్తు పూర్తి చేసిన అనంతరం న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు.పూర్తిస్థాయి విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఎల్‌బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా 13వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వాణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6,100 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసిన ఇన్వెస్టిగేషన్ అధికారి రెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. మంజుల కృషితో నిందితుడికి శిక్ష పడినట్లు పోలీసులు తెలిపారు.

మంత్రి వాకిటి శ్రీహరికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘన స్వాగతం

- **పున్నెల క్రాస్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే**

హనుమకొండ, నవంబర్ 20 (సమయం న్యూస్) :

జిల్లాలో పలు అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఘన స్వాగతం పలికారు.ఐనవోలు మండలం పున్నెల క్రాస్ వద్ద మంత్రి వాకిటి శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ఆత్మీయంగా పలకరించుకున్నారు. జిల్లాలో మంత్రి పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, రాష్ట్ర టెస్కాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎనిమిది మంది ఏఎస్ఐ లకు పదోన్నతులు

- **నూతన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలి.. వరంగల్ సీపీ 'ఎన్.శ్వేత'**

వరంగల్, నవంబర్ 20 (సమయం న్యూస్)

పోలీసు శాఖలో విధి నిర్వహణలో చూపిన అనుభవం, సేవలకు గుర్తింపుగా అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్లుగా (ఏఎస్ఐ) పనిచేస్తున్న ఎనిమిది మంది అధికారులు సబ్‌ఇన్‌స్పెక్టర్లుగా (ఎస్ఐ) పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నూతనంగా పదోన్నతి పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పదోన్నతితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని, విధి నిర్వహణలో మరింత అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత



ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ విధి నిర్వహణలో ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. పదోన్నతి పొందిన వారిలో టి.కమల, ఎం.రాజేందర్, ఏ.సగాయమ్మ, వై.కాసులు, కె.పద్మ, ఎన్.లక్ష్మి, కె.సంతోష, సి.హెచ్.పద్మ ఉన్నారు.

59వ జాతీయ గ్రంథాలయ ముగింపు వారోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

- **కుంభం అనిల్ కుమార్ రెడ్డి.**

భువనగిరి నవంబర్ 20 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తీ ఆహ్వానం మేరకు నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, విద్యార్థులు, యువతలో పఠనాసక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు



పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో చదివే అలవాటును పెంపొందించేందుకు గ్రంథాలయ వారోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం విద్యార్థులకి బహుమతుల ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ల పల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్పర్సన్ పోతం శెట్టి మంజులవెంకటేశ్వర్లు స్థానిక కౌన్సిలర్ బెండె స్వరూప లాల్ రాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు,జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగారెడ్డి పేరు పలికే అర్హత రేవంత్ రెడ్డికి లేదు

- **రామలింగారెడ్డి పేరు పలికే అర్హత రేవంత్ రెడ్డికి లేదు**
- **40 ఏళ్లుగా కేసీఆర్‌తో మా కుటుంబానికి అనుబంధం – రామలింగారెడ్డి కుటుంబ సభ్యులు**

మా నాన్న రామలింగారెడ్డి గారికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారితో 40 ఏళ్ల అనుబంధం ఉంది. మా నాన్నగారి వివాహానికి పెద్దగా నిలిచింది కూడా కేసీఆర్ గారే. ఆయన అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్న సమయంలో అండగా నిలిచి కాపాడింది కూడా కేసీఆర్ గారేనని రామలింగారెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు.మా నాన్నగారి అంత్యక్రియల్లో కేసీఆర్, హరీశ్‌రావు గార్లు పాల్గొని పాడె మోశారు. నాడు, నేడు మా కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నది బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, హరీశ్‌రావు గార్లేనని పేర్కొన్నారు.జర్నలిస్టుగా ఉన్న రామలింగారెడ్డికి దుబ్బాక ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి రాజకీయంగా ప్రోత్సహించింది కేసీఆర్ గారేనన్నారు. ఎంతోమంది టికెట్ కోసం ప్రయత్నించినప్పటికీ మా కుటుంబంపై నమ్మకంతో అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. హరీశ్‌రావు గారు తోబుట్టువులా భావించి ఇంటింటా ప్రచారం చేసి అండగా నిలిచారని తెలిపారు.“ఆనాడు మిరుదొడ్డి మండల ఇన్‌చార్జిగా ఉన్న రేవంత్‌రెడ్డి మా ఓటమి కోసం సర్వశక్తులు ఒడ్డారు. ఇప్పుడు స్వార్థ రాజకీయాల కోసం మా నాన్న రామలింగారెడ్డి పేరు ప్రస్తావిస్తూ కేసీఆర్, హరీశ్‌రావు గార్లపై విమర్శలు చేయడం సరికాదు” అని అన్నారు.ఓటమి తర్వాత బాధలో ఉన్న తమ కుటుంబానికి కొండంత భరోసా ఇచ్చింది కేసీఆర్, హరీశ్‌రావు గార్లేనని చెప్పారు. తమ కుటుంబం కష్టాల్లో ఉన్నా, సంతోషంలో ఉన్నా ప్రతి అడుగులోనూ వారు అండగా నిలిచారని తెలిపారు.

“మా జీవితాల్లో కేసీఆర్, హరీశ్‌రావు గార్ల సహాయం, అభిమానం ఎప్పటికీ మరువలేం. జీవితాంతం వారికి రుణపడి ఉంటాం. చనిపోయిన ఒక మనిషి గురించి రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధపు విమర్శలు చేయడం బాధాకరం. మా నాన్న రామలింగారెడ్డి పేరు పలికే నైతిక అర్హత రేవంత్‌రెడ్డికి లేదు” అని రామలింగారెడ్డి కుటుంబ సభ్యులు తీవ్రంగా స్పందించారు.

ములుగు మున్సిపల్ పన్నుల పెంపుపై రాజకీయ దుమారం

- **కాంగ్రెస్ ఆరోపణలను ఖండించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు.. పన్నులు తగ్గించే వరకు పోరాటం ఆగదు**

ములుగు, నవంబర్ 20 (సమయం న్యూస్)

ములుగు మున్సిపాలిటీలో పెంచిన ఇంటి, వాణిజ్య పన్నుల వ్యవహారం రాజకీయ వివాదానికి దారితీసింది. పన్నుల పెంపుపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తప్పుబట్టగా తాజాగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు స్పందిస్తూ కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను ఖండించారు. వాస్తవాలను పక్కదారి పట్టిస్తూ తమపై నిందలు మోపుతున్నారని ఆరోపించారు.కౌన్సిల్ సమావేశాల అసలు వేశాల హాజరు పట్టీ, నిర్ణయాల నమోదు పుస్తకాలను వేర్వేరుగా నిర్వహించాల్సి ఉండగా ఒకే రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల సమావేశాల్లో వ్యతిరేకించిన అంశాలు సైతం ఆమోదం పొందినట్లు రికార్డుల్లో నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రస్తావించినా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కౌన్సిల్‌లో తీర్మానాలు ఆమోదించే మెజారిటీ కాంగ్రెస్‌కే ఉందని, పన్నుల పెంపు బాధ్యతను ప్రతిపక్షంపై నెట్టడం సరికాదన్నారు.పన్నుల పెంపు తీవ్రత డిమాండ్ నోటీసులు అందిన తర్వాతే తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. సీడీఎంఏ వెబ్‌సైట్‌లో ఇతర మున్సిపాలిటీల పన్నులతో పోల్చి పరిశీలించగా, ఒకే



తరహా అసెస్‌మెంట్లకు వేర్వేరు పన్నులు విధిస్తున్నట్లు గుర్తించామని వెల్లడించారు. ప్రజలు, వ్యాపారులపై అదనపు పన్నుల భారం పడకుండా పెంచిన ఇంటి, వాణిజ్య పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశాల మినిట్స్, పన్నుల పెంపునకు సంబంధించిన తీర్మానాలు, విధింపు వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని కోరారు. పన్నుల తగ్గింపు జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ కౌన్సిలర్లు స్పష్టం చేశారు.